తిరిగి తెలుగుదేశం పార్టీలోకి మాగుంట కుటుంబం

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ అనుచరులు చేరిక

జిల్లా నాయకులతో ఎంపీ మంతనాలు

చిలకలూరిపేట సభలో పాల్గొననున్న

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి

ఒంగోలులోని మాగుంట నివాసంలో ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ఇన్‌చార్జులతో సమావేశమైన ఎంపీ శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి



జిల్లాలో ప్రత్యేకించి ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ప్రజాగౌరవం ఉన్న మాగుంట కుటుంబం తిరిగి తెలుగుదేశం పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. ఆ కుటుంబ ప్రతినిధి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అందులో భాగంగా సోమవారం ఉదయం ఉమ్మడి జిల్లాలోని టీడీపీ నాయకులతో ఆయన తన నివాసంలో భేటీ అయ్యారు. ఈనెల 17లోపు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరటం, ఆ తర్వాత ప్రధాని పాల్గొనే చిలకలూరిపేట సభకు ఆయన హాజరుకావటం ఖాయమని తేలిపోయింది. మాగుంట కుటుంబంతోపాటు గత 30 ఏళ్లుగా వారిని అనుసరిస్తున్న పలువురు మాగుంట అభిమానులు, వైసీపీ నాయకులు, ముఖ్యులు, స్థానిక సంస్థల బాధ్యులు కూడా టీడీపీలో చేరబోతున్నారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో మాగుంట కుటుంబం టీడీపీలో చేరనున్నడం ఆ పార్టీకి సానుకూల అంశం కాగా, వైసీపీకి బిగ్ షాక్ అని చెప్పవచ్చు.

మరింత బలం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీకి మరింత ఊపునిచ్చేలా అడుగులు పడుతున్నాయి. ఆత్మగౌరవం లేని వైసీపీలో ఇమడలేక ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తమ కుటుంబం రాజకీయాల్లోనే ఉంటుందని చెప్పిన ఆయన ఏ పార్టీలో చేరతారనే విషయాన్ని ఆ రోజు స్పష్టం చేయలేదు. తెలుగుదేశం పార్టీలోనే చేరబోతున్నట్లు కనిపిస్తున్నా బీజేపీలో కూడా చేరే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. నియోజకవర్గానికి ఎంత ప్రాధాన్యత ఇస్తారో అంతే స్థాయిలో ఢిల్లీ రాజకీయాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తుంటారు. ఆయన స్థానికంగా ఏ పార్టీలో ఉన్నా, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారితో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీకి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరేది ప్రకటించకపోవటంతో బీజేపీలో చేరవచ్చనే ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటికి సోమవారం ఆయన తెరదించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో తనను కలిసేందుకు వచ్చిన నేతలకు అల్పాహార విందు ఇచ్చారు. వారితో సుదీర్ఘ మంతనాలు జరిపిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమ కుటుంబం టీడీపీలో చేరబోతున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

రాఘవరెడ్డినే పోటీ

ఇటీవల తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై నిర్వహించే ఫోన్ సర్వేలో ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట రాఘవరెడ్డి అయితే ఎలా ఉంటుందనే అభిప్రాయ సేకరణ చేశారు. ఆ తర్వాత మరోసారి మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీ అభ్యర్థి అయితే మీకు అంగీకారమేనా? అంటూ మరో సర్వే చేశారు. దీంతో కూడా మాగుంట విషయంలో టీడీపీలో ఏం జరుగుతుందోననే అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఆ విషయంపై ఇప్పటికీ టీడీపీ అధిష్ఠానంలో స్పష్టత లేదని కూడా అంటున్నారు. అయితే మాగుంట మాత్రం సోమవారం టీడీపీ నాయకులతో భేటీ అనంతరం లోక్‌సభ నుంచి తన కుమారుడు రాఘవరెడ్డి పోటీలో ఉంటారని ప్రకటించారు. అవసరమైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్ప లోక్‌సభకు పోటీ చేయబోనని తేల్చిచెప్పారు. ఆ విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా తెలిపినట్లు ప్రకటించారు. అంతేకాక చంద్రబాబు సూచనకు అనుగుణంగా చిలకలూరిపేట సభలో కానీ, ఆ ముందుగానీ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

సమన్వయంతో ముందుకుసాగుదాం

చిలకలూరిపేట సభ కన్నా ముందే టీడీపీలో చేరినా ఆ సభకు హాజరై టీడీపీ, జనసేన, బీజేపీల కలయికను స్వాగతించాలని నిర్ణయించుకున్నారు. కాగా మాగుంటతోపాటు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ వైసీపీలోని పలువురు ప్రముఖులు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. వారిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు వివిధ హోదాల్లో వైసీపీ పదవులు ఉన్న వారు ఉన్నారు. అలా పార్టీలోకి వచ్చే వారిని సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని సోమవారం మాగుంటను కలిసిన టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. వేరే ప్రాంతంలో వేరే కార్యక్రమంలో ఉన్న కనిగిరి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి తొలి నుంచి మాగుంటతో సన్నిహిత సంబంధాలు ఉన్నందున ముందుగానే స్వాగతం పలికారు. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో మాగుంటను కలిసి స్వాగతం పలికిన వారిలో సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థులు బీఎన్.విజయ్‌కుమార్, ఎరిక్షన్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, గిద్దలూరు, మార్కాపురం, చీరాల టీడీపీ ఇన్‌చార్జిలు అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి ఎంఎం.కొండయ్యయాదవ్‌లతో పాటు ఇతర పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి బాధ్యుడిగా

జగన్‌పై కేసు పెట్టండి

మురళి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి

రిమ్స్ వద్ద వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన టీడీపీ నేతలు

రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్



జనార్దన్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న మృతుడి తల్లి

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 11 : మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో మరణించిన పారిశుధ్య కార్మికుడు ఊదరగొడి మురళీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకుని, న్యాయం చేయాలని, ఆయన మృతికి కారణమైన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై ఏ1గా కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలులోని రిమ్స్ వద్ద మృతుని కుటుంబ సభ్యులను జనార్దన్, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ సభ విజయవంతం కోసం ఇళ్లలో ఉండేవారిని కూడా బలవంతంగా తీసుకెళ్లారన్నారు. అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకుని హైవేని దిగ్బంధించారని ధ్వజమెత్తారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే అతను చనిపోయాడని చెప్పారు. గతంలో కందుకూరులో జరిగిన చంద్రబాబు నాయుడు సభలో జరిగిన తొక్కిసలాటలో కొందరు ప్రాణాలు కోల్పోతే అప్పట్లో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుపై కేసుపెట్టారని, అదే చట్టాన్ని వైసీపీకీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆధారమైన మురళీకృష్ణ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆయన భార్యకు ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇద్దరు పిల్లలను చదవించాలని దామచర్ల డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు టీడీపీ పోరాడుతోందన్నారు. జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ వైసీపీ భజన సభ కారణంగా పారిశుధ్య కార్మికుడు మరణించడం బాధాకరమన్నారు. సిద్ధం పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. ఒంగోలుకు చెందిన కార్మికుడు మరణిస్తే ఇంతవరకు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాలినేని నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మార్చురీ వద్ద నిరసన చేపట్టారు. మురళీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మురళీ కుటుంబాన్ని ఆదుకుంటాం-బాలినేని

కాగా మురళీకృష్ణ కుటుంబాన్ని వైసీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మురళి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, అలాగే ఆయన భార్యకు ఉద్యోగం, సొంతిల్లు మంజూరు చేస్తామని తెలిపారు. తన వ్యక్తిగతంగా సొంత నిధులు రూ. 3లక్షలు అందజేశారు.

పది పరీక్షలకు ప్రశ్నపత్రాలు సిద్ధం

ఒంగోలు(విద్య), మార్చి 11 : జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నపత్రాలు వచ్చాయి. ఈ ఏడాది పరీక్షలకు 30,928 మంది హాజరవుతుండగా వారిలో 29,449 మంది రెగ్యులర్ కాగా, 1479 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. వీరికి మొత్తం 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను ఆది, సోమవారాల్లో జిల్లాలోని 38 పోలీస్‌స్టేషన్లలో భద్రపర్చారు. మొత్తం 12 రూట్లలో పోలీసు భద్రతతో ఆయా పోలీస్ స్టేషన్లకు ప్రశ్నపత్రాలను తరలించి భద్రపర్చినట్లు డీఈవో సుభద్ర, ప్రభుత్వ పరీక్షల కమిషనర్ కే శివకుమార్‌లు తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ఎస్‌బీఐ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న రామకృష్ణ, సీపీఐ శ్రేణులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ వెంటనే ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. వాటి వివరాల వెల్లడిపై నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు సీపీఐ కార్యాలయం నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వచ్చే నగదు ఉపయోగించుకొని అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తులు వారి నల్లధనాన్ని ఇలా వైట్‌గా మారుస్తూ ఎన్నికల అనంతరం తగిన విధంగా లబ్ధిపొందేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈనెల 15లోపు బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్. వెంకట్రావు, పీవీఆర్ చౌదరి, అందె నాసరయ్య, ఎస్‌డీ యాసిన్, కే వీరారెడ్డి, వీ హనుమారెడ్డి, ఆర్. రామకృష్ణ, సయ్యద్ మౌలాలి, ప్రభాకర్, రమేష్, విజయ ఉన్నారు.

ఎన్నికల ఎరేశారు..

కోర్టులో ఉన్న స్థలంలో పట్టాలు ఇచ్చేందుకు

పారిశుధ్య కార్మికులకు ప్రలోభం

ఇన్నాళ్లు వదిలేసిన వైసీపీకి వారిపై

అకస్మాత్తుగా ప్రేమ

హడావుడిగా స్థల పరిశీలన చేసిన

రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 11 : ఇరవై ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికులకు పట్టాలు ఇచ్చే అంశాన్ని పట్టించుకోని వైసీపీ నేతలకు ఎన్నికల వేళ వారిపై అకస్మాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు ఈ ఎత్తుగడ వేశారని కొందరు విమర్శిస్తున్నారు. వైసీపీ నేతల ఒత్తిడితో రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు హడావుడిగా స్థల పరిశీలన చేయడం గమనార్హం. వివరాల్లోకెళితే... నగర పరిధిలోని కమ్మపాలెం సమీపంలోని దారావారికుంటలో సర్వేనెం. 1137లోని సుమారు రెండెకరాల స్థలంలో కొన్నేళ్లుగా ఒంగోలు నగరపాలక సంస్థ కార్మికులు తాత్కాలిక గృహాలు నిర్మించుకుని ఉంటున్నారు. ఇదిలా ఉండగా, గతంలో రజకుల కోసం కేటాయించిన కుంట కాగా, ఆ తర్వాత కాలనుగుణంగా అక్కడ రజకుల జీవన వృత్తి నిలిచిపోయింది. అప్పట్లో కొందరు వ్యక్తులు ఈ స్థలానికి పట్టాలు పుట్టించి పలువురికి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఆ తర్వాత కొందరు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ స్థలంపై వివాదం నడుస్తూనే ఉంది. ఇదిలా ఉండగా గతంలో రెవెన్యూ కార్పొరేషన్ అధికారులు ఆ స్థలం ఖాళీ చేయాలని అక్కడ నివసిస్తున్న పారిశుధ్య కార్మికులకు నోటీసులు జారీ చేశారు. నేటికీ ఆ వ్యవహారం తేలకపోగా, ప్రస్తుతానికి కార్మికులే నివాసం ఉంటున్నారు. గతంలో రెండుసార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు, నేడు వారికే పట్టాలు ఇస్తామంటూ హడావుడి చేయడం ఎన్నికల వేళ వైసీపీ ఎత్తుగడగా భావిస్తున్నారు. అతి త్వరలోనే ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పారిశుధ్య కార్మికులపై ప్రేమ పుట్టుకురావడంపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



కుంట స్థలాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ ఇదే హడావుడి

గడిచిన కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ దారావారికుంటలో పారిశుధ్య కార్మికుల పట్టాల ఇచ్చే వ్యవహారం హడావిడిగా నడిచింది. వైసీపీకి ఓటు వేస్తే అందరికీ పట్టాలు ఇస్తామని మభ్యపెట్టారు. ఆ తర్వాత పాలకవర్గం ఏర్పాటై 43 మంది వైసీపీకి చెందిన వారే ఉన్నారు. ఏనాడూ పట్టించుకోని వారు తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు మరోసారి పట్టాల పేరుతో హడావిడి చేయడంపై ఎన్నికలలో వైసీపీ గెలుపు కోసం అధికారులు హడావుడి చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమై స్థానికంగా నివాసం ఉండే కార్మికులు మాట్లాడుతూ ఇక్కడ సుమారు 120 కుటుంబాలు ఉన్నాయని, ఒక్కో కుటుంబానికి ఒకటిన్నర సెంటు భూమి ఇవ్వాలని తాము తహసీల్దారుకు విన్నవించామని చెబుతున్నారు. పట్టాలిస్తే అందరికీ ఒకేచోట ఇవ్వాలని, తెల్లవారుజామున పిల్లలను వదిలి పారిశుధ్య పనులకు వెళతామని, కార్పొరేషన్ కార్యాలయం దగ్గరగా ఉండే తమకు మరోచోట ఇస్తే వెళ్లేదిలేదని వారు చెబుతున్నారు.

హడావుడిగా అధికారుల పరిశీలన

సోమవారం జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, కార్పొరేషన్ కమిషనరు, తహసీల్దారు, ఇరిగేషన్ ఎస్ఈలు దారావారి కుంటకు వెళ్లి అక్కడి వారితో మాట్లాడారు. ఎంతమంది ఉన్నారు? ఎన్ని కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారనే వివరాలు సేకరించడంతోపాటు, వారి ఆధార్, రేషన్ కార్డులను పరిశీలించారు. త్వరలోనే పట్టాలు ఇచ్చే ప్రక్రియ చేపడతామని అధికారులు చెప్పారు. ఇటీవల జగనన్న ఇళ్ల పట్టాలు అక్కడ నివసించే 13 మంది కార్మికులకు మంజూరు కాగా, వారిని వారికి కేటయించిన స్థలానికి వెళ్లాలని సూచించారు. మిగిలిన వారికి పట్టాలు త్వరలోనే ఇస్తామని చెప్పడంతో అధికారుల సూచనలను కార్మికులు అంగీకరించలేదు. అందరికీ ఒకే చోట ఇవ్వాలని, గడిచిన ఇరవై ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని వారు తెలిపారు. దీనిపై అధికారులు త్వరితగతిన సర్వే చేసి సమగ్రమైన నివేదిక ఇవ్వాలని జేసీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువకులలో

ఒకరి పరిస్థితి విషమం

కందులూరు వద్ద ఘటన



ప్రమాద స్థలంలో యువకుని మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

టంగుటూరు, మార్చి 11 : ముగ్గురు యువకులతో వేగంగా వెళ్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోవడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, రెండో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఇక మూడో యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన ఆదివారం జరిగినప్పటికీ సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే... కందులూరుకు చెందిన పైనం రిమోరియో(20), దార్ల సుశాంత్(18), దార్ల సూర్యలు చీరాల వెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయలుదేరారు. వీరు కందులూరు నుంచి సూరారెడ్డిపాలెం మార్గంలో గ్రామం దాటి కొంచెం ముందుకు వచ్చే క్రమంలో మలుపు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల్లో రిమోరియో అక్కడికక్కడే మృతి చెందగా, సుశాంత్, సూర్యలు తీవ్రంగా గాయపడ్డారు. దారినపోయే వారు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారమే సుశాంత్ కన్నుమూశాడు. సూర్య ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం పోలీసు
లంతా సిద్ధం సభకు మేదరమెట్ల వెళ్లడంతో కందులూరు వద్ద జరిగిన ప్రమాద ఘటన వెలుగు చూడలేదు. మృతులు ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతుండగా, సూర్య ఇంటర్ చదువుతున్నాడు. అందరూ అన్నదమ్ముల పిల్లలు కావడంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒంగోలు ఆసుపత్రి నుంచి టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు... ప్రమాద సంఘటనపై ఎస్సై నాగేశ్వరరావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బుర్రా

హాజరుకాని ఇన్‌చార్జి దద్దాల



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరిలో వైసీపీలో వర్గపోరు

కనిగిరి, మార్చి 11 : కనిగిరి వైసీపీలో వర్గపోరు రగులుతూనే ఉంది. పట్టణంలోని 7వ వార్డు కొత్తూరులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఆ వార్డు కౌన్సిలర్ తమ్మినేని సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఇన్‌చార్జి దద్దాల నారాయణకు ఆహ్వానం పలకడంతోపాటు శిలాఫలకంలో ఆయన పేరును కూడా వేశారు. వైసీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఆయన విగ్రహావిష్కరణకు రాకపోవడంతో వర్గపోరు మరోసారి బయటపడింది. అదేవిధంగా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని ఆహ్వానం పలికిన సమయంలో ఎన్నికల అనంతరం విగ్రహావిష్కరణ పెట్టుకోవాలని కౌన్సిలర్ సుజాతకు ఆయన సూచించినా, కార్యక్రమానికి మాత్రం హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి సత్యవతి, రామనబోయిన ప్రశాంతి, రామనబోయిన శ్రీనివాసులు, దేవరాజ్, రాజా, ఏడుకొండలు, కోఆప్షన్ చింతం శ్రీనివాసులు, రంగనాయకులరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, మరికొంతమంది ఎమ్మెల్యే అనుచరవర్గం హాజరుకాగా 13వ వార్డు కౌన్సిలర్ రిజ్వాన్‌బేగంతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు హాజరు కాలేదు.

ఎమ్మెల్యే వెళ్లిన అనంతరం హాజరైన జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గుంటక

ఎమ్మెల్యే బుర్రా వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి కందుకూరు వెళ్లిపోయినట్లు తెలుసుకున్న జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి వైఎస్సార్ విగ్రహం వద్దకు రావడం గమనార్హం. ఈ సంఘటనతో ఎమ్మెల్యే బుర్రాకు, ఇన్‌చార్జి దద్దాలకు మధ్య అంతర్గత పోరు బహిర్గతమైంది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలి

● పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్‌లు డిమాండ్ చేశారు. ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1,650 కోట్లు ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడులకు గురవుతున్నారన్నారు. అధికారంలోకి రాక ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. విద్యాదీవెన, వసతి దీవెనలకు సవాలక్ష ఆంక్షలు పెట్టడం వల్ల ఎక్కువ మంది విద్యార్థుల ఆ పథకాలకు దూరమవుతున్నారన్నారు. మరో వైపు సంక్షేమ వసతిగృహాల్లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిబుల్ ఐటీలకు స్వంత భవనాలను ఏర్పాటు చేయకుండా, ప్రొఫెసర్లను నియమించకుండా, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆయా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి. కోటి, పి. వీరాస్వామి, కే శివబాలాజీ, చరణ్, వెంకటేష్, చంద్ర తదితరులు ఉన్నారు.



అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సంతనూతలపాడు నేతలు

అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలి

● కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్ఎన్‌పాడు వాసులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : సంతనూతలపాడు మండలంలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడు మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సంతనూతలపాడుతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నాలుగేళ్ల నుంచి అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతంతో పాటు పంచాయతీ నిధులను ఇష్టారీతిన ఖర్చు చేశారని ఆరోపించారు. 2018 నుంచి ఇప్పటి వరకు పంచాయతీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపె సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సంతనూతలపాడుకు చెందిన పలువురు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న ఆంజనేయులు

అక్రమార్కుల అరెస్టుకు డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : ప్రభుత్వ తనఖాలో ఉన్న దళితుల భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసి అక్రమార్కులను అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ తనఖాలో 2023 నవంబరు వరకు ఉన్న దళితుల భూములను 2010లో ఏ విధంగా రిజిస్ట్రేషన్లు చేశారని ప్రశ్నించారు. పెద్దచెర్లోపల్లి మండలం కోదండరామపురం, మెట్లవారిపాలెం గ్రామాలకు చెందిన దళితుల భూములు ఆక్రమించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురాం, బడుగు వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, కేఎఫ్‌బాబు, సీహెచ్ వినోద్, ఎర్రగుంట్ల బాలయ్యనారాయణ, చిన్నబాలయ్య, ఆదాం,మార్కండేయులు ఉన్నారు.

ఘనంగా సాయి ధ్యానమందిర వార్షికోత్సవం

ఒంగోలు(కల్చరల్), మార్చి 11:స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలోని శ్రీ సాయినాథుని ధ్యానమందిర 13వ వార్షిక వేడుకలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో నిరంతరాయంగా సాయినామ పారాయణ, శ్రీ సాయినాథుని శరత్ బాపూజీ సత్సంగ ఆడియో, వీడియో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అనంతరం పెళ్లూరులో గ్రామోత్సవం నిర్వహించారు.

భావితరాల భవిష్యత్‌కు టీడీపీని గెలిపించాలి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల



టీడీపీలో చేరిన 16వ డివిజన్‌కు చెందిన వైసీపీ సానుభూతిపరులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 11 : భావితరాల భవిష్యత్ కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ తెలిపారు. సోమవారం స్థానిక 24వ డివిజన్‌లోని బండ్లమిట్టలో ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో దామచర్ల మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎన్నికలు అత్యంత కీలకమైనవని అన్నారు. సైకో పాలనను శాశ్వతంగా తరిమేసి, సైకిల్ పాలనతో సంక్షేమం సాధించుకోవడానికి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. రాక్షస పాలన నుంచి ప్రజలను రక్షించడానికే టీడీపీ,జనసేన, బీజేపీ ఒక్కటయ్యాయని అన్నారు. ప్రజలు తమ విలువైన ఓటును సైకిల్ గుర్తుకు వేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యే డివిజన్ అభివృద్ధి కోసం రూ. 5.86 కోట్లతో అభివృద్ధి పనులుచేసినట్లు దామచర్ల వివరించారు. వైసీపీ వచ్చాక కనీసం రూ. 10లక్షలు కూడా ఖర్చు చేయలేదని అన్నారు. జనసేన అధ్యక్షుడు రియాజ్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందన్నారు. టీడీపీ చేసే అభివృద్ధిలో జనసేన కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ఓటమితోనే అన్నీ వర్గాలప్రజల్లో సంతోషాలు వస్తాయని రియాజ్ అన్నారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, టీడీపీ అధికార ప్రతినిధి బండారు మదన్, స్థానిక నాయకులు చెంగలశెట్టి మంగ, చెంగలశెట్టి అశోక్, మలిశెట్టి శ్రీనివాసులు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, పార్వతి పలువురు పాల్గొన్నారు.

16వ డివిజన్ నుంచి పలువురు టీడీపీలో చేరిక

స్థానిక 16వ డివిజన్‌కు చెందిన వైసీపీ సానుభూతి పరులు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీరాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ సమక్షంలో పత్తిపాటి రామచంద్రరావు, పత్తిపాటి మహేష్, పత్తిపాటి శ్రీనివాసరావు, మార్పూరి రామకృష్ణతోపాటు మరో 30 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధం

● సుప్రీం తీర్పును అమలు చేయాలి

● ధర్నాలో సీపీఎం నేతలు



ఎస్‌బీఐ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. సీపీఎం పోలిట్ బ్యూరో ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఒంగోలు బ్రాంచి కార్యాలయంవద్ద జరిగిన ధర్నాకు జి.రమేష్ అధ్యక్షత వహించారు. ధర్నాలో హనీఫ్ మాట్లాడుతూ రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసేందుకు బీజేపీ ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని రూపొందించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మోదీ ప్రభుత్వానికి రుచించదని, ఈ తీర్పు అమలును దెబ్బతీసేందుకు ఎస్‌బీఐ ద్వారా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని, దాని మిత్రపక్షాలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు గడువు కావాలని ఎస్‌బీఐ విజ్ఞప్తి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎస్‌బీఐ కార్యకలాపాలన్నీ డిజిటల్ రూపంలో ఉంటాయని, ఆ సమాచారం చెప్పేందుకు 21 రోజులు సరిపోవా అని ప్రశ్నించారు. ఎస్‌బీఐ వివిధ సాకులు చెప్పడం తగదన్నారు ఈవిధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం. రమేష్ తదితరులు ఉన్నారు.

సంతనూతలపాడులో

సంతనూతలపాడు, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే సుప్రీంకోర్టుకు వెల్లడించాలని సీపీఎం నాయకులు షేక్ మాబు కోరారు. సోమవారం సంతనూతలపాడులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను నిర్దిష్ట వ్యవధిలోనే పరిష్కరించాలి



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీలత

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : స్పందన అర్జీలను నిర్దిష్ట వ్యవధిలోనే కచ్చితంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత ఆదేశించారు స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ అనంతరం జరిగిన స్పందన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై డీఆర్వో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 180 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించడంలో ప్రమాణాలు పాటించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారులకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్వో సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, ఝాన్సీలక్ష్మి, లోకేశ్వరరావుతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

కేంద్ర పథకాలను అర్హులకు అందించాలి

ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు(రూరల్), మార్చి 11 : పేదలకు, విద్యావంతులకు, పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనే ఉత్సాహవంతులకు కేంద్రప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారులు పనిచేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధికారులకు సూచించారు. ఒంగోలు కలెక్టరేట్‌లో ఎంపీ అధ్యక్షతన సోమవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షక సమావేశం జరిగింది. ఈసమావేశంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను అర్హతగల ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చేయాలన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ కమిటీలో సభ్యులు వ్యక్తం చేసిన విషయాలను, సమస్యలను అధికారులు నోట్ చేసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించే విధానాన్ని కమిటీ సభ్యులకు తెలపాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వచ్చేవేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యలేకుండా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, దిశ కమిటీ సభ్యులు సోము వీరాంజనేయరెడ్డి, శ్రీ చంద్రకాంత్, దుగ్గిరాల వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో జాలిరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ ఈలు మర్దన్ అలి, కొండయ్య, వివిధ శాఖల అధికారులు ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఒంగోలు(విద్య), మార్చి 11 : రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఉద్యోగుల జనవరి, ఫిబ్రవరి నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని, నిరవధిక సమ్మె విరమణ సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయం వద్ద అక్కడ పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు.

ఈకార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, ఆనంద్, జ్యోతి, శ్రీనివాసులు, రోహిణి, సుబ్బులు పాల్గొన్నారు. జిల్లాలోని ఎంఆర్‌సీలు, హైస్కూళ్లు, కేజీబీవీల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణి, వినయ్, శ్రీదేవి, కుమారి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఓటర్‌కు అవగాహన గోడపత్రిక ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాబోయే సాధారణ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించే గోడపత్రికలను కలెక్టర్ దినేష్‌కుమార్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీపీవో నారాయణ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి ఎన్, లక్ష్మానాయక్, పంచాయతీ రాజ్ ఎస్ఈ కొండయ్య ఇతర అధికారులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోడపత్రికను జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు, ప్రభుత్వరంగ సంస్థలలో ప్రదర్శించాలన్నారు. ఎస్‌వీఈఈపీ అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



అధికారులకు అర్జీఇచ్చి మాట్లాడుతున్న కరవది వాసులు

కరకట్ట తొలగింపుపై కరవది వాసుల ఫిర్యాదు

ఒంగోలు(రూరల్)మార్చి11: మండలంలోని కరవది గ్రామపరిధిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కరకట్టను అక్రమంగా తొలిగించారని ఫలితంగా తాగునీటికి ఇబ్బంది పడాల్సివస్తుందని కరవది గ్రామస్థులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు అర్జీని సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే అక్రమంగా తొలగించిన కరకట్టను తిరిగి నిర్మింపజేయాలని కోరారు. అదేవిధంగా కరవది పీఏసీఎస్ ఆధ్వర్యంలో గతసంవత్సరం 25 క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేశారని, వాటిలో అక్రమాలు జరిగినందున, వాటిపై విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు యల్లమంద, మరికొందరు పాల్గొన్నారు.

1,010 మంది విద్యార్థులు గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 11 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సీనియర్ ఇంటర్ గణితం-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2 పరీక్షలకు 1,010 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలకు 18,133 మంది హాజరు కావాల్సి ఉండగా 17,123 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 15,583 మందికి 14,897 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,550 మందికి 2,226 మంది హాజరయ్యారు. ఆర్ఐవో సైమన్ విక్టర్ ఒంగోలు నగరంలోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించగా ఇతర అధికారులు 43 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉద్యోగుల జీతాలను తక్షణమే విడుదల చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం. రమేష్‌లు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. నెలంతా పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం 11వతేదీ వచ్చినా జీతాలు జమ చేయక పోవడం దుర్మార్గంగా ఉందన్నారు. జీతాల మీదనే ఆధారపడి కుటుంబాలు గడుపుకొనే ఉద్యోగులు నెలవారీ చెల్లించాల్సిన ఇంటి అద్దెలు, ఫీజులు, పాలు, నిత్యావసర సరుకులు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని వారు కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఒంగోలు(రూరల్)మార్చి11: చేజర్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఒంగోలు స్పందనలో సోమవారం కలెక్టర్‌కు చేజర్ల గ్రామరైతులు అర్జీ సమర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, రైతులు వెంకయ్య, చేజర్ల వెంకటేశ్వర్లు, ఎం.రామసుబ్బారావు, ఎం .శ్రీను, చేజర్ల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరిశపాడు శివాలయంలో చోరీ

మేదరమెట్ల , మార్చి 11: కొరిశపాడు శివాలయంలో తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి శివాలయానికి ఉన్న తలుపుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సుమారు 5 కేజీల వెండి, 2 సవర్ల బంగారం, రూ.80 వేల నగదు అపహరించినట్టు ఆలయ పూజారి శేషగిరి తలిపారు. ఆలయ ఈవో కృష్ణారెడ్డి కొరిశపాడు పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని శేషగిరి తెలిపారు.

అద్దంకిలో పోలీసుల కవాతు

అద్దంకి, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామనే భరోసా ప్రజలకు కల్పించేందుకు పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర బలగాలతో అద్దంకిలో కవాతు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి కవాతు ఆర్టీసీ బస్టాండ్, భవాని సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, నర్రావారి పాలెం, రామ్‌నగర్, బంగ్లా రోడ్డు మీదుగా సాగింది. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, పోలీస్, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఐదు సచివాలయాలకు ఆధార్ కిట్లు అందజేత



సచివాలయాలకు ఆధార్ కిట్స్‌ను అందజేస్తున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : జిల్లాలో ఐదు సచివాలయాలకు ఆధార్ కిట్స్ పరికరాలను కలెక్టర్ దినేష్‌కుమార్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఒంగోలుకు రెండు, నాగులుప్పలపాడు, పొదిలి, గిద్దలూరుకు ఒక్కొక్కటి చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి టి.ఉషారాణి ఉన్నారు.

ఏపీ సీనియర్ మహిళల హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్



రవికుమార్

సంతనూతలపాడు, మార్చి 11: ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళల హాకీ జట్టు మేనేజర్‌గా మండలంలోని మైనంపాడు జడ్పీహైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్న టి.రవికుమార్‌ను నియమించినట్లు సోమవారం హాకీ ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఈనెల 13 నుంచి 23 వరకు మహారాష్ట్రలోని పూనేలో నిర్వహించే 14వ హాకీ ఇండియా సీనియర్ మహిళల జాతీయటోర్నమెంట్‌లో పాల్గొనే హాకీ జట్టుకు ఏపీ జట్టుకు రవికుమార్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈసందర్భంగా పలువురు రవికుమార్‌ను అభినందించారు.

డీసీవోగా శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరెడ్డి

ఒంగోలు(విద్య), మార్చి 11 : జిల్లా సహకారాధికారిగా(డీసీవో) బి. శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రాజమండ్రి సహకార కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డిని ఉద్యోగోన్నతిపై డీసీవోగా ఇక్కడ నియమించారు. డిప్యూటీ రిజస్ట్రార్(డీఆర్)గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్(ఎస్‌సీడీఆర్)గా ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో గత మూడు సంవత్సరాలుగా ఇన్‌చార్జీల పాలనలో ఉన్న జిల్లా సహకారశాఖకు రెగ్యులర్ అధికారి వచ్చినట్లు అయింది. జిల్లా సహకారాధికారిగా మూడు సంవత్సరాల నుంచి పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా సహకార ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్ నుంచి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

సీటీవోకు సన్మానం



సీటీవో దుంపా ఝాన్సీని సత్కరిస్తున్న మహిళా ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు దుంపా ఝాన్సి, సోమసుందరప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా దుంపా ఝాన్సీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకుమార్, కొండలరావు, విజయలక్ష్మి, నిర్మలాదేవి, అహ్మద్ బాషా, సరోజినిదేవి, శ్రీరాములు, ఐవీ సుబ్బారావు, అంజయ్య, ధారా సుధాకర్, షరీఫ్, తిమోతి, శేషు, మణి తదితరులు ఉన్నారు.

పేస్ కళాశాలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న పేస్ కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(విద్య), మార్చి 11 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ స్టార్టప్ ఇకోసిస్టమ్ ఎనాబులర్ ఇనిస్టిట్యూట్ అవార్డుకు ఎంపికైంది. అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీ ఆటల్ ఇంక్యు బేషన్ సెంటర్‌లో ఈనెల 9,10 తేదీల్లో జరిగిన స్టార్టప్ జాతాలో ఈ అవార్డును నీతి ఆయోగ్ చైర్మన్, ఆటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఫౌండర్ డాక్టర్ రమణన్ రామనాథన్ నుంచి పేస్ కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తిలు అభినందించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీజీఎస్ఎఫ్ సంస్థ ప్రతినిధులు

సంతనూతలపాడు, మార్చి 11: స్థానిక జడ్పీ హైస్కూల్లో గ్రంథాలయానికి సోమవారం పీజీఎస్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో 950 పుస్తకాలను హెచ్ఎం పి.రామారావుకు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు డాక్టర్ కొర్రపాటి సుధాకర్, రిటైర్డ్ ఇంజనీర్ సుబ్రమణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు వై.సుబ్బారావులు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు ఎక్కువగా మొబైల్ తో గడుపుతున్నారని, వారిని పుస్తకపఠనం చేయించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

సచివాలయాలతో ప్రజలకు చేరువైన సేవలు



ప్రారంభోత్సవంలో చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ,ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి, మార్చి11: సచివాలయాలతో ప్రజలకు సేవలు మరింత చేరువయ్యాయని జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండలంలోని దేవరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ సముదాయాలను సోమవారం ఆమెతో పాటు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు,చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి,గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి,పులి వెంకటరెడ్డి,దాసరి లక్ష్మీనారాయణ, బూచేపల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ. 230

సంతనూతలపాడు, మార్చి 11: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు రుద్రవరం గ్రామం నుంచి 667 బేళ్లు వచ్చాయి. వాటిలో 631 బేళ్లు అమ్ముడుకాగా 36 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.230లు పలకగా, కనిష్ఠ ధర రూ.215లు పలికిందని, సరాసరి ధర రూ.227.45 వచ్చినట్లు తెలిపారు. వేలంలో 22 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీపీ శంకుస్థాపన

నాగులుప్పలపాడు, మార్చి 11: మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఉప్పుగుండూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలు భవనం ప్రహరీ గోడ నిర్మాణం, రెండో వార్డులో సీసీ రోడ్డు ఏర్పాటు, యాదవ కమ్యూనిటీ పార్కు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి సోమవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎంపీపీ అంజమ్మను ఘనంగా సన్మానించారు.

టీడీపీలో చేరిన పది కుటుంబాలు



ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలోకి చేరిన టీడీపీ కుటుంబాలు

పొన్నలూరు (కొండ పి), మార్చి 11 : మండలంలోని చౌటపాలేనికి చెందిన పది వైసీపీ కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా స్వామి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. గ్రామ టీడీపీ నాయకులు ఉన్నం శ్రీను, పాతూరి కోటయ్యల ఆధ్వర్యంలో నన్నం చెన్నకేశవులతోపాటు మరో పది కుటుంబాలు చేరడంపై స్వామి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్నా కోటిరెడ్డి, గుమ్మళ్ల వెంకట్రావు, అనుమోలు రాజారమేష్, మండవ మురళి, ఉన్నం బసవయ్య, నన్నం చెన్నయ్య పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ. 231

కొండపి, మార్చి 11 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో కేజీకి ఒక రూపాయి ధర పెరిగింది. సోమవారం కేజీకి అత్యధిక ధర 231 రూపాయలు లభించింది. అయ్యపరాజుపాలెం, నరసరాజుపాలెం, పెదకండ్లగుంట గ్రామాల రైతులు పొగాకు బేళ్లను వేలానికి తెచ్చారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

సింగరాయకొండ, మార్చి 11 : మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఒంగోలు డీఎస్పీ ఎం.కిశోర్‌బాబు సోమవారం పరిశీలించారు. సింగరాయకొండ, మూలగుంటపాడు, పాకల గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికలు సజావుగా జరగడానికి తగు సూచనలు చేశారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ రంగనాథ్‌కు సూచనలు చేశారు. అనంతరం సింగరాయకొండలో ట్రాఫిక్ రద్దీగా ఉండే కందుకూరు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు.

బ్రహ్మోత్సవాల లోపు పృథులగిరి రహదారి పనులను పూర్తిచేయాలి

మర్రిపూడి, మార్చి 11 : పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే రహదారి పనులను సోమవారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ కుప్పం కొల్లారావులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ మధుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరి భాస్కరరావు, ఈవో శ్రీనివాసరావు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచేపల్లి నాగయ్య, వైసీపీ నాయకులు ఇనుకొల్లు మాదిరెడ్డి, వేంపాటి పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వృద్ధుడి పడిగాపులు

● ఉన్నతాధికారులు ఆదేశించినా స్పందించని వలంటీర్

మర్రిపూడి, మార్చి 11 : మండలంలోని రామాయపాలెంలో తుళ్లూరు సుబ్బయ్య అనే వృద్ధుడు పింఛన్ కోసం 10 రోజులుగా పడికాపులు కాస్తున్నాడు. ఒకటి, రెండు తేదీల్లో వలంటీర్ పింఛన్ ఇవ్వకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల సూచనల మేరకు సంక్షేమ సహాయకుడు వచ్చి సుబ్బయ్య వేలిముద్రలు వేయించుకొని వలంటీర్ వద్ద నగదు తీసుకోవాలని సూచించారు. వలంటీర్ నగదు ఇవ్వకుండా తిప్పుకోవడంతో ఎంపీడీవో సుదీపను కలిసి ఫిర్యాదు చేశాడు. ఆమె ఆదేశాలను సైతం వలంటీర్ పట్టించుకోలేదు. అంతే కాకుండా తమ ప్రమేయం లేకుండా వేలిముద్రలు తీసుకోవడంపై వెల్ఫేర్ అసిస్టెంట్‌పై వలంటీర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం కల్పించిన సామాజిక భద్రత పింఛన్‌ను బాధితుడికి ఇప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలను లక్షాధికారిని చేయడమే లఖ్‌పతి దీదీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేయడమే లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళల కుటుంబాలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించి ఏడాదికి లక్ష రూపాయలకు పైగా నికర ఆదాయం వచ్చేలా చేసేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 1,375 స్వయం సహాయక సంఘాల లఖ్‌పతి దీదీలకు రూ. 11.82 కోట్లు సీఐఎఫ్/ వీఆర్ఎఫ్ రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వసుంధర తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనలో దళితులకు తీరని ద్రోహం

మద్దిపాడు, మార్చి 11: వైసీపీ పాలనలో దళితులకు తీరనిద్రోహం జరుగుతుందని టీడీపీ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ విజయకుమార్ అన్నారు. సోమవారం గుండ్లాపల్లి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి దళితులపట్ల వివక్ష చూపుతున్నారన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారిపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మాజీ సర్పంచ్ తుమ్మల సుధాకర్‌బాబు, పోకూరి శ్రీనివాసరావు, పారా నరసింహారావు, టీవీ వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

మద్దిపాడు, మార్చి 11: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ పి.అనురాధ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. పాస్ పుస్తకాలు పెండింగ్ ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, ఆర్ఐ అనూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మద్దిపాడు, మార్చి 11: మండలంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.

బీఎన్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



బీఎన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, మార్చి 11: టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని సంతనూతలపాడు క్రిస్టియన్‌పాలెంకు చెందిన టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం ఒంగోలులోని కార్యాలయంలో బీఎన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. తనను కలిసిన నేతలతో బీఎన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అన్యాయం చేసిందని, చంద్రబాబు సీఎం అయిన తరువాత ప్రతి ఒక్కరికీ అభివృద్ధి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.అంకారావు, క్రిస్టియన్‌పాలెం టీడీపీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

మార్కాపురం వన్ టౌన్, మార్చి 11: గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అవసరమని అంగన్‌వాడీ సూపర్వైజర్ రవికుమారి అన్నారు. పట్టణంలోని 57, 58, 59 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగులు, జొన్నలు, పప్పులు, కూరగాయలు ప్రదర్శించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

నమూనా పోలింగ్‌పై అవగాహన



పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఈఆర్వో, తహసీల్దార్

కొండపి, మార్చి11: ఓటర్లు తమ ఓటు హక్కును ఈవీఎంల ద్వారా వినియోగించుకునే విధానాన్ని నమూనాగా కొండపి ఈఆర్వో ఎ. కుమార్, కొండపి తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్ ఓటర్లకు సోమవారం సాయంత్రం అవగాహన కలిగించారు. కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓటర్లకు అవగాహన కలిగించి వారితో ఓట్లు పోల్ చేయించారు. ఓటర్లకు తాము ఓటు వేసిన గుర్తు స్లిప్‌ను చూసుకునే విధానం వివరించి ప్రయోగాత్మకంగా చూపించారు. 15 మందితో నమూనా ఓట్లు వేయించారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి, ఎంఈవో కె. సురేఖ, ఎన్నికల అధికారి హనుమంతరావు, వీఆర్వో సుశీల, మహిళా పోలీసు వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

జరుగుమల్లి (కొండపి), మార్చి 11 : మండలంలోని దావగూడూరు గ్రామంలోని 98, 99 నంబర్ల పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై సోమవారం రెవెన్యూ, ఎన్నికల అధికారులు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా స్థానికులను సమీకరించి వారితో నమూనాగా ఓట్లు వేయించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితనంపై అవగాహన కలిగించారు. అవగాహన కార్యక్రమంలో జరుగుమల్లి సెక్టార్ అధికారి హరిబాబు, ఆర్ఐ రమణయ్య, దావగూడూరు వీఆర్వో నెహేమియా, కానిస్టేబుల్ చిరంజీవి సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి,మార్చి11: సిద్ధం బహిరంగసభ తొపులాటలో మృతిచెందిన ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇట్టా నాగయ్య, పాలేటి ఏడుకొండలు, పద్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి నష్టపరిహారం చెల్లించాలి

గిద్దలూరు : సిద్ధం బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మేదరమెట్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇందుకు ముఖ్యమంత్రే నైతిక బాధ్యత వహించి ఆయన కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని స్థానిక మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగయ్య, మురళీలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు బాలయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధవీడులో వృద్ధురాలి దారుణ హత్య

● పోలీసుస్టేషన్‌కు దగ్గరలోనే ఈ దారుణం
● ఒంగోలు నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం రాక



వాసన పసిగడుతున్న డ్యాగ్‌స్క్వాడ్

అర్ధవీడు (కంభం), మార్చి 11 : మండల కేంద్రం అర్ధవీడులో దారుణం చోటుచేసుకొంది. అర్ధవీడు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు హత్య కు గురికాగా, ఆ విషయం మూడు రోజుల తర్వాత వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడుకు చెందిన పత్తిపాటి మహాలక్ష్మమ్మ (63) కుమారుల వద్ద నివసిస్తోంది. శనివారం ఉదయం గేదెలకు గడ్డి తెచ్చేందుకు బయటకు వచ్చింది. అయితే రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో గత రెండు రోజులుగా గ్రామంలో జరుగు తున్న శివరాత్రి ఉత్సవాలకు వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు భావించారు. రెండు రోజులు గడిచినా మహాలక్ష్మమ్మ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, తెలిసిన వారిని అడిగినా జాడ తెలియలేదు. దీంతో కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలోనే ఆది వారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదురుగా సాయిబాబా మందిరం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గృహం నుంచి దుర్వాసన వస్తోంది. ఈ విషయాన్ని గ్రామస్థులు కొంతమంది పోలీసులకు ఆమె కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి 9గంటల సమయంలో సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లి చూడగా, మిద్దెపై బాత్‌రూమ్‌లో వెంకటలక్ష్మమ్మ మృతదేహం వివస్త్రగా పడి ఉంది. ఆమె ఇంటి నుంచి తీసుకువచ్చిన టవల్, గడ్డినంచి తూర్పు వైపున ఖాళీ స్థలంలో పడి ఉన్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. వృద్ధురాలి హత్యవార్త గ్రామంలో తెలియడంతో భయాందోళనకు గురయ్యారు. పోలీసుస్టేషన్, మండల రెవెన్యూ, పరిషత్ కార్యాలయాల ఎదురుగా నిత్యం వాహనాలు, ప్రజలు తిరుగుతూనే ఉంటారు. నిర్మాణంలో ఉన్న గృహంలో ఈ దారుణం జరుగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై అర్ధవీడు ఎస్సై అనితను వివరణ కోరగా వృద్ధురాలి వద్ద రూ.1800 డబ్బులు, బంగారు కమ్మలు అలాగే ఉన్నాయని, పోస్టుమార్టం వచ్చిన తరువాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఇక ఒంగోలు నుంచి వచ్చిన డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం వివరాలు సేకరించింది. పోలీసులను కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు. ట్రైనీ డీఎస్పీ షహబాజ్ అహ్మద్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ స్తంభానికి సపోర్టు తీగ ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



సపోర్టింగ్ తీగను ఏర్పాటు చేసిన అధికారులు

ఒంగోలు(రూరల్)మార్చి11: ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. సోమవారం ఆశాఖ అధికారులు వారిసిబ్బందితో కలిసి స్తంభానికి సపోర్టు తీగను ఏర్పాటు చేశారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి, విద్యుత్ అధికారులకు పరిసన కాలనీల వాసులు ధన్యవాదాలు తెలిపారు.

పశ్చిమ ప్రకాశం ప్రజలను మోసం చేసిన జగన్


● బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్

మార్కాపురం వన్ టౌన్, మార్చి 11: వెలిగొండ ప్రాజక్టు పూర్తి కాకుండానే ప్రారంభించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నిజనిర్ధారణ కమిటీ వెలిగొండ సొరంగ పనులు ఫీడర్ కెనాల్ నిర్మాణం పూర్తి కాని పనులు పరిశీలించిందన్నారు. నిర్వాసిత గ్రామాలలో పర్యటించి పలు అంశాలు బహిర్గతం చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.1400కోట్లు తీర్చకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. అర్హులైన నిర్వాసితులకు పరిహారం అందకపోగా అనర్హులు పరిహారం పొందారని గ్రామాలలో ప్రజలు తమకు తెలిపారన్నారు. ప్రాజెక్టు రివిట్‌మెంట్ పూర్తి కాలేదన్నారు. కొల్లంవాగు వద్ద హెడ్ రెగ్యులేటరీ పనులు పూర్తి కాకుండా ప్రాజెక్టులో జగన్ జాతికి ఎలా అంకితం చేశారో అర్థం కావడం లేదన్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వంతెనలు పూర్తి కాలేదన్నారు. రెండవ టన్నెల్‌లు ప్రధాన డ్యామ్ వద్ద 2009లో నిర్మించిన ఫీడర్ కెనాల్ మొత్తం మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. దీంతో మట్టితో పూడిపోయిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేసినా ప్రాజెక్టు మరో మూడేళ్లు పడుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, జాతీయ సభ్యులు సరోజిని, రాష్ట్ర సభ్యులు కొట్టు శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి, మార్కాపురం ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ప్రొటోకాల్ వివాదం



వివాదస్పద శిలాఫలకం

నాగులుప్పలపాడు, మార్చి 11: అధికార వైసీపీలో ప్రొటోకాల్ వివాదం నెలకొంది. మండలంలోని ఈదుముడిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవాల కోసం అంతా సిద్ధం చేశారు. మూడు శిలాఫలకాలపైనా అదే గ్రామానికి చెందిన మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు పేరును ముద్రించకపోవడంతో గొడవ మొదలైంది. సోమవారం సాయంత్రం మంత్రి మేరుగ నాగార్జున ఆయా భవనాలను ప్రారంభించేందుకు గ్రామస్థాయి నాయకులు ఏర్పాట్లను పూర్తిచేసి శిలాఫలకాలను సిద్ధం చేశారు. తీరా చూస్తే కనకారావు పేరు లేదు. మంత్రి సోమవారం రాత్రి 8గంటల సమయంలో ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. మొదట వైఎస్సార్ విగ్రహం, బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రధాన భవనాలను ప్రారంభించడానికి బయలుదేరారు. అదే సమయంలో తమ నాయకుడి పేరు శిలాఫలకాలపై లేదంటూ కనకరావు వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో గ్రామ వైసీపీలోని రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సర్పంచ్ బోలే లక్ష్మి, ఆమె భర్త ఆంజనేయులు అక్కడకు చేరకుని మంత్రిని తమ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడకు కూడా కనకరావు వర్గీయులు వెళ్లడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిసేపు వారు ఆందోళన నిర్వహించారు. అదేసమయంలో కనకరావు అక్కడకు చేరుకుని తమ వర్గీయులకు సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత దళితుడినైన తనను గ్రామానికి చెందిన కొందరు నాయకులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి బెన్హర్ పేరు శిలాఫలకంపై ముద్రించారని, గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి ప్రొటోకాల్ ఉన్న తన పేరు లేకుండా ప్రారంభోత్సవం ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్ఠానంతోపాటు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు కనకారావు తెలిపారు. ఈ వివాదం మంత్రి మేరుగ నాగార్జునకు తలనొప్పిగా మారింది.

పోలింగ్ కేంద్రాల వద్ద వివరాల బోర్డులు ఏర్పాటు



బోర్డును పరిశీలిస్తున్న తహసీల్దార్

కొండపి, మార్చి 11 : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గోడలపై, నల్ల రంగు బోర్డులపై వివరాల నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్, తహసీల్దార్ బి. కిరణ్ కుమార్ పరిశీలించారు. కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాల వద్ద రాస్తున్న వాల్ బోర్డులను వారు సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బోర్డులపై పోలింగ్ కేంద్రం నంబరు, అసెంబ్లీ నియోజకవర్గం నంబరుతోపాటు లోక్‌సభ నియోజకవర్గం వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలతోపాటు నియోజకవర్గ ఈఆర్వో పేరు, సెల్ నంబరు, మండల తహసీల్దార్ పేరు, సెల్ నంబరు, బీఎల్వో పేరు, సెల్ నంబరు, పోలింగ్ కేంద్రం వివరాలను బోర్డుపై నమోదు చేయిస్తున్నారు. ఇదేవిధంగా అన్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వివరాలు నమోదు చేయాలని నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లను ఆదేశించామని ఈఆర్వో కుమార్ తెలిపారు.

భవిత కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

జరుగుమల్లి(కొండపి), మార్చి 11 : జరుగుమల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్య పరిశీలకుడు మల్లికార్జున, రాష్ట్ర సహిత విద్య కోఆర్డినేటర్ రమేష్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం జడ్పీస్కూల్‌లోని ప్రత్యేక విద్య కేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. సహిత విద్య అభివృద్ధికి, ప్రత్యేక విద్య అభివృద్ధికి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు బి. నరసింగరావు, ఎంవీజీ సంజీవరావు, ఎస్. నరసయ్య పాల్గొన్నారు.

నాదెండ్ల బ్రహ్మయ్య హత్య అమానుషం

టంగుటూరు, మార్చి 11 : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ నాదెండ్ల బ్రహ్మయ్య హత్య అత్యంత అమానుషమని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి ఎన్ నాగరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈదారుణ హత్య సంఘటనను పీవైఎల్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నాదెండ్ల బ్రహ్మయ్య టంగుటూరు మండలం కారుమంచిలో పుట్టి విద్యార్థి దశ నుంచే పీడీఎస్‌యూలో క్రియాశీలకంగా పని చేశారని వారు గుర్తు చేశారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి
- వైసీపీని టీడీపీలో పలువురి చేరికలు

గిద్దలూరు టౌన్, మార్చి 11 : బీసీలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కంభం మండలం యర్రబాలెం మాజీ సర్పంచ్, విద్యాకమిటీ చైర్మన్, వైస్ సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ, జనసేనలతోనే బీసీల సంక్షేమం సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోని బీసీలు ఐక్యంగా పోరాడి, టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ పిక్కిలి ఆదినారాయణ, విద్యాకమిటీ చైర్మన్ పిక్కిలి సుబ్బయ్య, పిక్కిలి వెంకటరమణ, పిక్కిలి రాజయ్య, పిక్కిలి నాగేశ్వరరావు, నల్లబోతుల పోలయ్య, పిక్కిలి రాములు, పిక్కిలి పుల్లయ్య, నల్లబోతుల మస్తాన్, నల్లబోతుల కాశి నారాయణ, నల్లబోతుల కాశయ్య, పిక్కిలి పాండు, పిక్కిలి చెన్నకేశవులు, మీనిగ కాశీరావు, మీనిగ పిచ్చయ్య, పిక్కిలి రవీంద్రతోపాటు కంభం మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలోనికి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

టీడీపీ అధికారంలోకి రావడం అవసరం

ఎర్రగొండపాలెం : రాష్ట్రం అభివృద్ధి చేందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంద ని ఆ పార్టీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని మురారిపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి 30 కుటుంబాలు చేరాయి. ఎరిక్షన్‌బాబు వారందరికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ నాయకుడు బాశం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టో ప్రజలకు దోహదపడుతుందని, అందుకే వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, సీనియర్ టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు వేగినాటి శ్రీను, బాశం లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అచ్యుతరావు, మురారిపల్లె టీడీపీ నాయకులుపాల్గొని, ర్యాలీ నిర్వహించారు.



మురారిపల్లెలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండలం వాదంపల్లి గ్రామం నుంచి వైసీపీ నుంచి టీడీపీలోకి పలు కుటుంబాలు చేరాయి. వలంటీర్ వై మరియబాబు, ఆధ్వర్యంలో జె జేమ్సుపాల్, వై డేవిడ్,ఓబులేసు, పాల్‌జోస్‌తో 20 కుటుంబాలు చేరాయి. ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీలో చేరిన వలంటీర్ వై చిన్నమరియబాబు మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పేదలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. అందుకే టీడీపీలో చేరినట్లు తెలిపారు. టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ లోకి వచ్చే ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. టీడీపీ తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఏబీఎం ఆస్తులను ఆక్రమించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పాస్టర్ల నిరసన



నిరసన తెలుపుతున్న పాస్టర్లు

మార్కాపురం రూరల్, మార్చి 11: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏబీఎం స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి నాదెండ్ల సుబ్రహ్మణ్యంను వెంటనే అరెస్ట్ చేయాలని పాస్టర్లు కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఏబీఎస్ ఆస్తుల పరిరక్షణ సమితి, బాప్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ర్యాలీగా వచ్చి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా బాప్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవానందం మాట్లాడుతూ.. ఎస్ఎస్ నగర్‌పై హైకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను అమలు చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. ఎస్ఎస్ నగర్ బోర్డును వెంటనే తొలగించాలని పాఠశాల ద్వారంకు ఉన్న తాళాలు తీసివేసి, పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు. త్వరితగతిన ఏబీఎం ఆస్తులను అప్పజెప్పాలని లేని పక్షంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చిలక చక్రవర్తి, పులుకూరి ఆంధ్రస్, ఏసపోగు ప్రసాద్, అబ్రహం, మాకం అబ్రహం, జెడీ లక్ష్మయ్య ప్రేమయ్య, బాప్టిస్ట్ అసోసియేషన్ ఫీల్డ్ సంఘాల పాస్టర్లు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుడికి నష్టపరిహారం చెల్లించాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

గిద్దలూరు, మార్చి 11 : సిద్ధం బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మేదరమెట్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇందుకు ముఖ్యమంత్రే నైతిక బాధ్యత వహించి ఆయన కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి పక్కా ఇళ్ల నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని స్థానిక మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడ రేషన్ నాయకులు నాగయ్య, మురళీలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు బాలయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రోరల్ బాండ్లు సుప్రీంకోర్టుకు అందజేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 11: ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెంటనే సుప్రీంకోర్టుకు అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తర్లుపాడు రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు కార్యాలయం ఎదురు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు డి.సోమయ్య మాట్లాడుతూ.. దేశంలోని రాజకీయ పార్టీలకు కార్పొరేట్ కంపెనీలు అందించే విరాళాల వివరాలను గోప్యంగా ఉంచటానికి వీలు కలిగించే విధంగా ఉన్న ఎలక్ట్రోరల్ బాండ్‌లు చెల్లుబాటు కావని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. సదరు వివరాలను భారతీయ స్టేట్ బ్యాంకు యాజమాన్యం సుప్రీంకోర్టుకు అందజేయాలన్నారు. బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీకి రాజకీయ లబ్ది చేకూర్చే విధంగా స్టేట్‌బ్యాంకు యాజమాన్యం ప్రయత్నం చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం ఉల్లంఘించే గడువు పెంచాలని కోరాటం బీజేపీకి లొంగుబాటేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫి, రూబెన్; రాజు, నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ లేక ప్రజల ఇక్కట్లు

- రెండు నెలల నుంచి నిలిచిన ధ్రువపత్రాల జారీ
- పర్మినెంట్ తహసీల్దార్ నియామకానికి వినతి



అర్ధవీడు తహసీల్దార్ కార్యాలయం

కొమరోలు, మార్చి 11 : తహసీల్దార్ కార్యాలయంలో రెండు నెలలుగా తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులు తాము తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు 1బీ, అడంగళ్లు అవసరం. అదేవిధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ ఆర్మీ ఉద్యోగాలకు పచ్చజెండా ఊపింది. దీంతో అవసరమైన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పింఛనుదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొమరోలు మండలం తహసీల్దార్‌గా పనిచేసిన రమాదేవిని ఎన్నికల నేపథ్యంలో నెల్లూరుకు బదిలీ చేశారు. అప్పటి నుంచి కొమరోలుకు తహసీల్దార్ లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కలెక్టర్ కొమరోలు తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రావును నియ మించారు. అయితే ఆ యన విధుల్లో చేర లేదు. దీంతో బేస్తవారపేట తహసీల్దార్ పద్మావతిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆమె కేవలం ఎన్నికల విధులకు మాత్రమే పరిమితం అయ్యారు. విద్యార్థులకు అవసమైన కులం, ఆదాయం, ఈబీసీ ధ్రువపత్రాలు, రైతులకు అవసరమైన భూసమస్యల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు 196 వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుమారు 200లకు పైగా భూసమస్యలు పెండింగులో ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులకు అన్ని ప్రవేశ పరీక్షలకు ఇటీవలె విడుదలైన ఆర్మీ ఉద్యోగాలకు అవసమైన ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాల్లోను, మీసేవా కేంద్రాల్లోనూ దరఖాస్తులు చేసుకున్నారు. బ్యాంకుల్లో తీసుకు న్న రుణాలను రెన్యూవల్ చేసుకునేందుకు అవసరమైన 1బీ, అడంగళ్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్ల కోసం కోసం తహసీల్దార్, సచివాలయ చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవలె కొమరోలుకు డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున ఇటీవలె వచ్చారు. ఆయన ధ్రువీకరణ పత్రాల సంతకాల కోసం బేస్తవారిపేటకు పంపినా ఇప్పటికి సంతకాలు కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ విషయమై మండలంలోని ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. తక్షణమే కొత్త తహసీల్దార్ నియమించడం కానీ, డీటీ ద్వారా కానీ విద్యార్థులకు, రైతులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అర్ధవీడులో వృద్ధురాలి దారుణ హత్య

- పోలీసుస్టేషన్‌కు దగ్గరలోనే ఈ దారుణం
- ఒంగోలు నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం రాక

అర్ధవీడు (కంభం), మార్చి 11 : మండల కేంద్రం అర్ధవీడులో దారుణం చోటుచేసుకొంది. అర్ధవీడు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు హత్యకు గురికాగా, ఆ విషయం మూడు రోజుల తర్వాత వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అర్ధవీడుకు చెందిన పత్తిపాటి మహా లక్ష్మమ్మ (63) కుమారుల వద్ద నివసిస్తోంది. శనివారం ఉదయం గేదెలకు గడ్డి తెచ్చేందుకు బయటకు వచ్చింది. అయితే రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో గత రెండు రోజులుగా గ్రామంలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలకు వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు భావించారు. రెండు రోజులు గడిచినా మహాలక్ష్మమ్మ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, తెలిసిన వారిని అడిగినా జాడ తెలియలేదు. దీంతో కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలోనే ఆది వారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదురుగా సాయిబాబా మందిరం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గృహం నుంచి దుర్వాసన వస్తోంది. ఈ విషయాన్ని గ్రామస్థులు కొంతమంది పోలీసులకు ఆమె కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి 9గంటల సమయంలో సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్లి చూడగా, మిద్దెపై బాత్‌రూమ్‌లో వెంకటలక్ష్మమ్మ మృతదేహం వివస్త్రగా పడి ఉంది. ఆమె ఇంటి నుంచి తీసుకువచ్చిన టవల్, గడ్డిసంచి తూర్పు వైపున ఖాళీ స్థలంలో పడి ఉన్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. వృద్ధురాలి హత్యవార్త గ్రామంలో తెలియడంతో భయాందోళనకు గురయ్యారు. పోలీసుస్టేషన్, మండల రెవెన్యూ, పరిషత్ కార్యాలయాల ఎదురుగా నిత్యం వాహనాలు, ప్రజలు తిరుగుతూనే ఉంటారు. నిర్మాణంలో ఉన్న గృహంలో ఈ దారుణం జరుగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఘటనపై అర్ధవీడు ఎస్సై అనితను వివరణ కోరగా వృద్ధురాలి వద్ద రూ.1800 డబ్బులు, బంగారు కమ్మలు అలాగే ఉన్నాయని, పోస్టుమార్టం వచ్చిన తరువాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఇక ఒంగోలు నుంచి వచ్చిన డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం వివరాలు సేకరించింది. పోలీసులను కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు. ట్రైనీ డీఎస్పీ షహబాజ్ అహ్మద్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



వాసన పసిగడుతున్న డ్యాగ్‌స్క్వాడ్

పది రోజులకొకసారే సాగర్ జలాలు..?

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత
- పట్టణంలో ఆక్రమణలపై చర్చ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 11: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. అజెండాలోని అంశాలను ఆమోదించిన అనంతరం టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ.. పట్టణంలో సాగర్ జలాలు రోజు మార్చి రోజు ఇచ్చే వారని ప్రస్తుతం పది రోజులకొకసారి ఇస్తున్నారని, అది కూడా మురికి నీరు వస్తోందని మండిపడ్డారు. పట్టణంలోని అన్ని వీధులు ఆక్రమణలకు గురయ్యాయని తొలగించాలని కోరారు. చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. వ్యాపారులు తమ సామాన్లు దుకాణాల నుంచి ఐదుడుగుల ముందు పెట్టుకొంటోంది వాస్తవమేనని వాటికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. నాలి కొండయ్య మాట్లాడుతూ.. అన్ని శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పట్టణంలోని ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. సాగర్ జలాల సరఫరాలో తరుచూ ఎందుకు సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రశ్నించారు. ఎస్ఎస్ ట్యాంకులో జలాలు తగ్గాయని 40రోజులకు సరిపడా నీళ్లు మాత్రమే ఉన్నాయని డీఈ సుభానీ తెలిపారు. రంజాన్ సందర్భంగా మసీద్‌ల వద్ద పారిశుధ్యం, వీధిదీపాల నిర్వాహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇస్మాయిల్ అన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ ఎం.సిరాజ్ అలీబేగ్ మాట్లాడుతూ.. తన వార్డులో ఇటీవల సప్లై ఛానల్‌పై బ్రిడ్జి నిర్మించే శంకుస్థాపన కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఒకరి పేరు మాత్రమే వేశారని మరో ఇద్దరి పేర్లు ఎందుకు వేయలేదని ప్రశ్నిం చారు. ప్రోటోకాల్ పాటించటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇష్టారీతిన వ్యవహరిస్తూ, రాజకీయంగా సమస్యలు సృష్టిస్తున్నారని చైర్మన్‌ను ఉద్దేశించి అన్నారు. పట్టణంలో కోతులు ప్రజలపై దాడులు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. ఆవులు రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు లోనై ఇటీవల రెండు మృతిచెందాయన్నారు. వీటిని గోశాలకు తరలించాలన్నారు. ఆవులను గోశాలలకు తరలించేం దుకు నిధులు లేకపోతే కౌన్సిలర్‌లే చందాలు వేసుకొని తరలిస్తామ న్నారు. ప్రోటోకాల్ విషయమై మరో వైసీపీ కౌన్సిలర్ బుశెట్టి నాగేశ్వర రావు, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ సమస్యలపై స్వపక్ష సభ్యులే సూటిగా ప్రశ్నించారు.



మాట్లాడుతున్న చైర్మన్ బాలమురళీకృష్ణ

కంభంలో ట్రాఫిక్ సమస్య జఠిలం

- ఆక్రమణలతో కుచించుకుపోయిన రోడ్లు

కంభం, మార్చి 11 : మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రాకపోకలకు తగ్గట్లు రోడ్ల అభివృద్ధి లేకపోవడం, ఆక్రమణలతో రోడ్లు కుచించుకు పోతున్నాయి. దీంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తల్లడిల్లుతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజారు, చౌక్ సెంటర్, కాలేజీ రోడ్డు, వైజంక్షన్, రంగవీధి, జామియామసీదు సెంటర్, కందులాపురం సెంటర్లలో వస్త్ర, బంగారు, హోల్‌సేల్, చిల్లర దుకాణాలు, రోడ్లపై తోపుడుబండ్లు, సరుకుల రవాణా చేసే వాహనాలు, డ్రైనేజీలను పూడ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కార్యాలయాలు వదలడంతో గంటలకొద్ది ట్రాఫిక్ నిలుస్తోంది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే నిలిపి వెళుతున్నారు. పోలీసులు విధులకు ఎప్పుడు వస్తారో, పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంభం మెయిన్ బజారులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

అవీ..ఇవీ..

పశ్చిమ ప్రకాశం ప్రజలను మోసం చేసిన జగన్

బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్

మార్కాపురం వన్ టౌన్, మార్చి 11: వెలిగొండ ప్రాజక్టు పూర్తి కాకుండానే ప్రారంభించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నిజనిర్ధారణ కమిటీ వెలిగొండ సొరంగ పనులు ఫీడర్ కెనాల్ నిర్మాణం పూర్తి కాని పనులు పరిశీలించిందన్నారు. నిర్వాసిత గ్రామాలలో పర్యటించి పలు అంశాలు బహిర్గతం చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.1400కోట్లు తీర్చకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. అర్హులైన నిర్వాసితులకు పరిహారం అందకపోగా అనర్హులు పరిహారం పొందారని గ్రామాలలో ప్రజలు తమకు తెలిపారన్నారు. ప్రాజెక్టు రివిట్‌మెంట్ పూర్తి కాలేదన్నారు. కొల్లంవాగు వద్ద హెడ్ రెగ్యులేటరీ పనులు పూర్తి కాకుండా ప్రాజెక్టులో జగన్ జాతికి ఎలా అంకితం చేశారో అర్థం కావడం లేదన్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్ వంతెనలు పూర్తి కాలేదన్నారు. రెండవ టన్నెల్‌లు ప్రధాన డ్యామ్ వద్ద 2009లో నిర్మించిన ఫీడర్ కెనాల్ మొత్తం మరమ్మతులు చేయకుండా వదిలేశారన్నారు. దీంతో మట్టితో పూడిపోయిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేసినా ప్రాజెక్టు మరో మూడేళ్లు పడుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, జాతీయ సభ్యులు సరోజిని, రాష్ట్ర సభ్యులు కొట్టు శ్రీనివాస్, కళ్యాణ చక్రవర్తి, మార్కాపురం ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యవసర వస్తువులు అందచేస్తున్న ఫాతిమా స్వచ్ఛంద సేవాసంస్థ

గిద్దలూరు టౌన్, మార్చి 11 : పట్టణంలోని నూర్‌భాషా ఫాతిమా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రంజాన్ మాసం ప్రారంభ సందర్భంగా సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి పీఆర్ కాలనీలోని సంజీవిని అనాథ శ్రమానికి ఎయిర్‌కూలర్, వంటపాత్రలు, నిత్యవర వస్తువులను నిర్వాహకులు రాజశేఖర్‌కు అందచేశారు. ఖాశింవలి మాట్లాడుతూ తమ సంస్థ అనాథలకు, పేదలకు ఎల్ల వేళలా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల ఖాదర్‌భాషా, కరీష్మా, ఖాశింబీ, బాబాఖాదర్, దూదేకుల దస్తగిరి, ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ప్రమాణం చేస్తున్న నూతన పాలకమండలి

మార్కాపురం వన్ టౌన్, మార్చి 11: పట్టణంలోని శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సోమవారం ఆల యంలో ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా దాసరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా ఉలాపు శివప్రసాద్, ధర్మకర్తలుగా టీవీ కాశయ్య, టి.అంజమ్మ, ఎం.రోజారాణి, కె.రమణమ్మ, ఎంవీ.రమణి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా అర్చకులు ఆవుల వెంకటేశ్వర్లు ప్రమాణస్వీకారం చేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

మార్కాపురం వన్ టౌన్, మార్చి 11: గర్భి ణీలు, బాలింతలకు పౌష్టికాహారం అవస ర మని అంగన్‌వాడీ సూప ర్‌వైజర్ రవికుమారి అన్నారు. పట్టణంలోని 57, 58, 59 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగులు, జొన్నలు, పప్పులు, కూరగాయలు ప్రదర్శించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

మహాశివునికి రావణబ్రహ్మ వాహనసేవ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 11: మార్కాపురంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మహాశివుని రావణబ్రహ్మవాహనంపై నటరాజా శివతాండవం అలంకారం చేసి నగరోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శనం చేసుకొని, కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



రావణబ్రహ్మ వాహనంపై పరమశివుడు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

- బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నేతలు



మేనిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేతలు

కొమరోలు : టీడీపీతోనే గిద్దలూరు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రెడ్డిచర్ల, బాదినేనిపల్లి, బాలిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం 'బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన స్థానికుడు అయిన ముత్తుముల అశోక్‌రెడ్డిని గెలిపించుకొని మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన సంక్షేమ గ్యారెంటీలను అమలు చేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధిస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా గాలికొదిలేసి 'జే ట్యాక్స్'ను ప్రజల నుంచి వసులుచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి,, కాంట్రాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి, గోపాలకృష్ణయ్య, మహానందిరెడ్డి, బి.వెంకటరెడ్డి, పి.రామిరెడ్డి, పెద్ద అంకయ్య, చిన్న అంకయ్య ముత్తుముల యల్లారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారపేట, మార్చి11 : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని బేస్తవారపేట మండల టీడీపీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పూనూరు భూపాల్‌రెడ్డి అన్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం బేస్తవారపేట మండలంలోని బార్లకుంట, బాలేశ్వరపురం గ్రామాల్లో టీడీపీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అక్రమాలపై ప్రజలు విసుగుచేందారన్నారు. దీంతో టీడీపీపై ప్రజలు అభిమాన పెంచుకున్నారని రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని వారు ప్రజలకు వివరించారు.

సిద్ధం సభ అట్టర్ ఫ్లాప్

దర్శి, మార్చి 11 : వైసీపీ సిద్ధం సభ అట్టర్ ఫ్లాప్ షోగా మిగిలిందని దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఒక ప్రటనలో తెలిపారు. జనం రాకపోవడంతో ఆలోపాన్ని కప్పిపుచ్చేందుకు గ్రాఫిక్స్ మాయతో ప్రజలను మభ్య పెడుతున్నారని వెంకట్ విమర్శించారు. తొక్కిసలాటలో మృతిచెందిన మురళి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన గోరంట్ల రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. దర్శిలో పోటీ చేసే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కనిగిరి, మార్చి 11 : ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీవీ రమణయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన నమూనాను పాఠశాలలో అందచేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రవేశ పరీక్షలు చూపిన ప్రతిభ, రిజర్వేషన్ ప్రకారం 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 94922 74832, 86886 31854 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గొంతెండుతోంది..!

- పాలూరివారిపల్లెలో తాగునీటి కష్టాలు
- పట్టించుకోని పాలకులు
- సమస్యను పరిష్కరించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



నీటి కోసం సిద్ధం చేసిన డ్రమ్ములు



పక్క కాలనీ నుంచి బిందెతో నీటిని మోసుకెళ్తున్న యువకుడు

పీసీపల్లి, మార్చి 11 : మండలంలోని పెదయిర్లపాడు పంచాయతీలోని పాలూరివారిపల్లిలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ఓవైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు మరో వైపు డీప్‌బోరుకు సంబంధించిన పైపులు మరమ్మతులకు గురవడంతో నీళ్లులేక పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 50 ఇళ్లు ఉన్నాయి. సుమారు 200 మంది జనాభా ఉన్నారు. వీరి దాహార్తి తీర్చేందుకు పెదయిర్లపాడు నీళ్ల ట్యాంక్ నుంచి పైపులైన్లు వేశారు. ప్రస్తుతం ఆ పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీనికితోడు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం తో పాటు వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో చేతిపంపులూ ఎండిపోయాయి. ఈ కారణంగా గ్రామంలో నీరు లేక పల్లెప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీస అవసరాలకు కూడా నీరు లభించకపోవడంతో ఎస్టీ కాలనీలోకి బిందెలతో పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ డ్రమ్ములు పెట్టుకుని నీరువచ్చే దాకా వేచిచూసి వాటిని నింపుకుని బిందెలతో మోసుకోవాల్సి వస్తుంది. పశువులకు నీరు లేక వాటి మూగరోదనలు చూసి గుండె తరుక్కుపోతుందని పల్లె ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో నీటి సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. జలజీవన మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని నిధులు కేటాయించినా పాలకులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

నిధులున్నా.. నీరు లేక

పంచాయతీలో ఆర్థిక సంఘం నిధులతోపాటు సాధారణ నిధులు లక్షలున్నాయి. ఈ పంచాయతీ సర్పంచ్ వైసీపీ మద్దతుదారైనప్పటికీ అన్నీ తాము చెప్పినట్టే వినాలని స్థానిక నాయకులు సర్పంచ్‌పై పెత్తనం చెలాయించేందుకు యత్నించారు. దీంతో సర్పంచ్ కొద్దినెలలుగా అసంతృప్తితో ఉన్నారు. వైసీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి సర్పంచ్ చేసే అభివృద్ధి పనులకు మోకాలడ్డుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకుల ఆధిపత్య పోరుతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కనీస అవసరాలకూ ఇబ్బందే..!



కొద్దినెలలుగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కనీస అవసరాలకు కూడా నీరులేక ఇబ్బందిపడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడంలేదు. పక్క కాలనీలో డ్రమ్ములు నింపుకుని అక్కడి నుచి బిందెలతో మోసుకోవాల్సివస్తుంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

- మహేంద్ర, పాలూరివారిపల్లి



విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీద్

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

ప్రత్యేక నమాజ్‌లకు సిద్ధమైన మసీద్‌లు

పామూరు, మార్చి 11 : ముస్లిం రంజాన్ అత్యంత పవిత్రమైన పండుగ. ఈ పండుగతోనే కొత్త ఉత్సాహం, ఆధ్యాత్మిక భావనతో మనసు నిండిపోతుంది. ఈ పండుగకు ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఈ మాసమంతా భక్తితో ఆత్మ ప్రక్షాళన చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. అల్లాహ్ చూపిన బాటలో జీవన యాగం సాగించేందుకు సంసిద్ధులవుతారు. షాబాన్ మాసం ముగిసిన తరువాత నెలవంక దర్శనంతో మొదలయ్యే పవిత్ర మాసం రంజాన్. షవ్వాల్ నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. షవ్వాల్ మొదటిరోజున నిర్వహించుకు ఈదుల్ ఫితర్ పండుగనే రంజాన్ పండుగగా పిలుస్తారు. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనం ఇవ్వడంతో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. నేటి నుంచి నెల రోజులపాటు ఉపవాసాలు పాటిస్తారు. సూర్యోదయానికి ముందే ఆహారం (సెహెరి) తీసుకుంటారు. సూర్య అస్తమయం వరకు కనీసం మంచి నీళ్లయినా తీసుకోరు. రోజులో ఐదు మార్లు నమాజ్ చేస్తారు. సూర్యాస్తమయం తరువాత ఆ రోజుకు ఉపవాస దీక్ష విరమించి మితాహారం (ఇఫ్తార్) తీసుకుంటారు. తర్వాత మళ్లీ అదనపు ప్రార్థన (తరావీ) చేస్తారు. పేదలు, అనాథల ఆకలి తెలుసుకునేందులు ఉపవాస దీక్షలు ఎంతో ఉపయోగపడుతాయి. విశ్వమానవాళికి వెలుగు మార్గం చూపిన దివ్య ఖురాన్ గ్రంథం అవతరించిన మాసం. గ్రామాల్లో రంజాన్ సందడి మొదలైంది. ఉపవాస దీక్షలు ప్రారంభించవచ్చునని సంకేతంగా మసీద్ మైకుల ద్వారా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాసల కోసం పట్టణంలోని పలు మసీద్‌లను కమిటీ నిర్వాహకులు సిద్ధం చేశారు. మసీద్‌లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలి

దర్శి, మార్చి 11 : సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఎం నాయకులు స్టేట్‌బ్యాంక్ ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి టీ రంగారావు మాట్లాడుతూ ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ఎన్నికల బాండ్లను బయటపెట్టే విధంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్నందున బ్యాంకర్లు వెంటనే వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టేట్‌బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈ నాగేశ్వరరావు, గర్నెపూడి జాన్, సామ్యేల్, బాలగురవయ్య సందు వెంకటేశ్వర్లు, ఆలూరి ఇస్మాయేలు, బాలమ్మ పాల్గొన్నారు.

పామూరు : ఎన్నికల బాండ్‌ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని సీపీఎం మండల కార్యదర్శి కే మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటేశ్వర్లు, అల్లాభక్ష్, సయ్యద్ గౌస్‌బాషా, బీ మహదేవయ్య, కరిముల్లా, వీ మాదవ, కృష్ణా, పీ శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.

జాలర్లకు వృత్తి నైపుణ్య పరీక్ష



వృత్తి పరీక్షను నిర్వహిస్తున్నమత్స్యశాఖ అధికారులు

పామూరు, మార్చి 11 : మండలంలోని మోపాడు రిజర్వాయర్ నుచ్చుపొద జాలర్ల సహకారం సంఘంలో నూతనంగా సభ్యత్వం కావాలనుకునే వారికి వృత్తి నైపుణ్య పరీక్షను సోమవారం నిర్వహించారు. పలువురు సంఘంలో సభ్యత్వాల కోసం దరఖాస్తులు చేసుకోగా వారికి సోమవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రిజర్వాయర్ వద్ద వృత్తి నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా మత్స్యశాఖ ఏడీ ఏ ఉషారాణి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మూడు రోజులు జరిగే స్కిల్ టెస్ట్ కార్యక్రమంలో తొలిరోజు 230 మంది మత్స్యకారులు దరఖాస్తులను చేసుకోగా 120 మందికి స్కిల్‌టెస్ట్‌ను నిర్వహించినట్లు ఏడీ తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు మత్స్యశాఖ ఏడీ రాము, ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఫీల్డ్‌మెన్ శ్రీనివాస్, పొట్టయ్య, వెలిగండ్ల ఎస్ఐ ఎం.శివ, జిల్లా విజిలెన్స్ ఎస్టీ, ఎస్సీ పొట్లూరి లక్ష్మయ్య, మత్స్యకారుల బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓగూరి ఏడు కొండలు, నరసింహారావు, చింతకుంట రమేష్, సంఘ సభ్యులు చేవూరు కొండయ్య, నవరం రాజేష్, లక్కనబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బోర్డుల ఏర్పాటు



కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

కొండపి, మార్చి 11 : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద గోడలపై, నల్లరంగు బోర్డులపై వివరాల నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్, తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్ పరిశీలించారు. కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాల వద్ద రాస్తున్న వాల్ బోర్డులను వారు సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బోర్డులపై పోలింగ్ కేంద్రం నంబరు, అసెంబ్లీ నియోజకవర్గం నంబరుతోపాటు లోక్‌సభ నియోజకవర్గం వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలతోపాటు నియోజకవర్గ ఈఆర్వో పేరు, సెల్ నంబరు, మండల తహసీల్దార్ పేరు, సెల్ నంబరు, బీఎల్వో పేరు, సెల్ నంబరు, పోలింగ్ కేంద్రం వివరాలను బోర్డుపై నమోదు చేయిస్తున్నారు. ఇదేవిధంగా అన్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద వివరాలు నమోదు చేయాలని నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లను ఆదేశించామని ఈఆర్వో కుమార్ తెలిపారు.

యథేచ్ఛగా కుంట పోరంబోకు ఆక్రమణ

- ఎక్స్‌కవేటర్‌తో చదును చేసిన వైనం
- వైసీపీ అండతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- కబ్జాలకు చెక్ పెట్టాలని ప్రజల విజ్ఞప్తి



కుంట భూమిలో చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

దర్శి, మార్చి 11 : దర్శి ప్రాంతంలో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు ఆక్రమించి సొంతం చేసుకుంటున్నారు. ఈ దారుణాలు దర్శి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా సోకాయి. తాజాగా దర్శి-పొదిలి రోడ్డులోని కుంట పోరంబోకు భూమిని ఆక్రమించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల కుంట పోరంబోకు ఉంది. ఆ భూమి దశలవారీగా ఆక్రమణలకు గురవుతూ వచ్చింది. గతంలో కొందరు సాగు చేసుకుంటూ అందులో కొంత భూమిని రికార్డుల్లోకి ఎక్కించుకొని అనుభవిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఖాళీగా ఉన్న రెండు ఎకరాలను ఆక్రమించుకొని బాగుచేసుకుంటున్నారు. ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు.

ఎంతో కాలంగా కొనసాగుతున్న వివాదం

ఈ కుంట పోరంబోకు భూమి విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ప్రస్తుతం చదును చేస్తున్న భూమిని కొన్నేళ్లుగా రాజంపల్లికి చెందిన కొంతమంది సాగు చేసుకుంటున్నామని ఆ భూమిలోకి దిగారు. అదేవిధంగా తూర్పువెంకటాపురానికి చెందిన కొంతమంది అందులో కొంతభూమి తాము కూడా సాగు చేసుకుంటున్నామని అందులోకి దిగడంతో వివాదం నెలకొంది. అప్పుడు రెవెన్యూ అధికారులు ఇరు వర్గాలను పిలిచి మాట్లాడారు. రికార్డుల ప్రకారం కుంట పోరంబోకు భూమి అయినందున ఎవ్వరికీ హక్కు ఉండదని ఎవరూ భూమిలో దిగవద్దని హెచ్చరించారు. భూమిలో ఆ సమయంలో హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును పీకిపడేసి ప్రస్తుతం కొంతమంది మళ్లీ ఆక్రమించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి తహసీల్దార్ సుజాత దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత భూమిలోకి ఎవరూ వెళ్లకుండా చూడాలని వీఆర్వోను ఆదేశించారు. దీంతో అక్కడకు వెళ్లిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను అడ్డుకున్నారు. తాత్కాలికంగా అడ్డుకున్నా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోకపోతే భూమి అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉంది. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి విజయానికి కృషి చేయాలి

టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల పిలుపు



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి రవికుమార్

తాళ్లూరు, మార్చి 11 :రాష్ట్రంలో నెలకొన్న అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడి మంచి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్ పిలుపునిచ్చారు. త్వరలో ఎన్నికలు జరుగనున్నందున సెంటిమెంట్ ప్రకారం ఈశాన్య గ్రామమైన మల్కాపురం, రజానగరం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబుకే సాధ్యమన్నారు.

రాష్ట్ర ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకొని జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు ప్రకటించారన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందా లంటే కేంద్ర సహకారం అవసరమనే బీజేపీతో పొత్తుకు సై అన్నారన్నారు. ఈ మూడు పార్టీల కూటమితో రాష్ట్రం అన్ని రంగాల్లో గాడిలో పడుతుందన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సైనికుల్లా శ్రమించాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ముందుగా గుంటి గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేసి ర్యాలీగా మల్కాపురం చేరుకున్నారు. మల్కాపురంలోని రాములవారి గుడి, బ్రహ్మంగారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ కాశీంసైదా, జనసేన పార్టీ అధ్యక్షుడు కూటాల ప్రసాద్, టీడీపీ నేతలు డాబా శ్రీను, సుబ్బారావు, శ్యాంసన్, కైపు రామకోటిరెడ్డి, జి.రమణారెడ్డి, మీరామొహిద్దీన్, శాగం కొండారెడ్డి, రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, కైపు నాగార్జునరెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, గొల్లపూడి వేణుబాబు, అనపర్తి సుబ్బారావు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణరెడ్డి, రామలక్ష్మయ్య, నరసింహారావు,తూముశివనాగిరెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాలతో మేలు



ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

పామూరు, మార్చి 11 : చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళా శక్తి పథకాలతో మహిళలకు ఆర్థిక మేలు చేకూరుతుందని టీడీపీ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మేరకు పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం, మండలాలు, గ్రామాలు అభివృద్ధికి నోచుకో లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం గట్టాలన్నారు. కనిగిరి ప్రాంత అభివృద్ధి కోసం డాక్టర్ ఉగ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జి పి తిరుపతయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న ఏఎస్ఐ మోహన్‌రావు

పాస్టర్స్ ప్రేయర్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు

తాళ్లూరు, మార్చి 11 : మండలంలోని పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను సోమవారం పంపిణీ చేశారు. కార్డుల పంపిణీ కార్యక్రమం రమణాలవారిపాలెం బెతేల్ ప్రార్థనా మందిరంలో జరిగింది. గుర్తింపు కార్డులను ఏఎస్ఐ మోహన్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఐ.రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు జి.యోహాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.రవీంద్ర, కోశాధికారి పి.సాల్మన్‌రాజు, దర్శినియోజకవర్గం అధ్యక్షులు పి.డేవిడ్ హర్సన్, ఏసుదాను, ఏసుబాబు, బీ అనిల్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పదును

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయుల కుస్తీ

పిల్లల్లో పోటీతత్వానికి ప్రోత్సాహక బహుమతులు



టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఇస్తున్న ఉపాధ్యాయుడు

దొనకొండ, మార్చి 11 : మరో వారం రోజుల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పుస్తకాలతో పదును పడుతున్నారు. వారి వారి పాఠశాలల ఉత్తీర్ణతను పెంచుకునేందుకు ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లో కలసి కుస్తీ పడుతున్నారు. దొనకొండ జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రం పరిధిలో దొనకొండ, ఆరవళ్లిపాడు, మంగినపూడి, చందవరం, తెల్లబాడు, గంగదేవిపల్లె, కొచ్చెర్లకోట మల్లంపేట జడ్పీ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల, విశ్వభారతి విద్యాలయం, శ్రీవివేకానంద పాఠశాలకు చెందిన మొత్తం 562 మంది విద్యార్థులు ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మొత్తం సిలబస్ పూర్తి చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్జెక్టు వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షా ఫలితాల ఆధారంగా గ్రేడ్లుగా విభజించి ఉత్తమ గ్రేడు పాయింట్లు సాధించేందుకు ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక మెలకువలను బోధిస్తూ విద్యార్థులకు పదును పెడుతున్నారు. దొనకొండ జడ్పీ పాఠశాల లెక్కల మాస్టారు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు పాఠశాల, మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటించి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో దొనకొండ ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలకు చెందిన విద్యార్థిని మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా ఈఏడాది ఆ స్థానం ఏ పాఠశాలను వరిస్తుందో అనేది ఉపాధ్యాయులు, ప్రజల్లో చర్చనీయాంశం.

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం



పదవ తరగతి విద్యార్థులు భయంలేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తూ వారిని సిద్ధం చేస్తున్నాం. ఉపాధ్యాయుల సహకారంతో నమూనాలతో పరీక్షలు నిర్వహిస్తూ లోపాలను గుర్తించి సరిదిద్దే ప్రయత్నాలు చేస్తూ నూరు శాతం ఉత్తీర్ణులయ్యేందుకు బాధ్యతగా కృషి చేస్తున్నాం.

- వీవీ రామాంజనేయులు, హెచ్‌ఎం, జడ్పీ పాఠశాల,దొనకొండ


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 12 మార్చి 2024

ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లు కాదు, ఏకంగా ఊళ్లు నిర్మించి ఇస్తున్నాం.. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్లిచ్చిన ఘనత మాది.. ఇదీ ప్రభుత్వంలోని పెద్దలు గత మూడేళ్లుగా ఊదరగొడుతున్న మాట. దీనికోసం భారీగా నిధులు ఖర్చు చేసి, పేదలకు ఇళ్లు ఇచ్చేసినట్టు కలరింగిచ్చింది. పాపం పేదలు కూడా నిజమేనని నమ్మేశారు. చివరకు నిర్మాణాలు పూర్తయిన ఇళ్లపై వైఎస్, జగన్ ఫొటోలు, వారిపేర్లు బలవంతంగా రాయించారు. కొన్నిచోట్లయితే ఏకంగా వైసీపీ రంగులు వేయించారు. దీనిపై కేంద్రం సీరియస్ కావటంతో వాటిని తీసేయించి, పీఎంఏవై బోర్డులను లబ్ధిదారుల వివరాలతో అంటించారు. ఆ తర్వాత లబ్ధిదారులకు అసలు పరీక్ష ఎదురైంది. ఇల్లు పూర్తయిన తర్వాత రావలసిన ఆఖరి బిల్లు నెలల తరబడి ఖాతాల్లో పడకపోవటంతో ఎదురుచూపులు చూస్తున్నారు. వారికి సమాధానం చెప్పే వారే కరువయ్యారు.

ఆఖరి బిల్లు.. నిల్!

- జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల పరిస్థితి ఇదీ
- సొమ్ము కేంద్రానిది... సోకు వైసీపీ సర్కారుది
- కేంద్ర ఇచ్చిన నిధుల వాటా రూ.1.5 లక్షల వరకు ఓకే
- రాష్ట్రం వాటా రూ.30వేల కోసం ఎదురుచూపులు
- ఇళ్లు పూర్తయి ఇళ్లలోకి వెళ్లిన లబ్ధిదారులకు నిరాశే
- ఇప్పటికే పిల్లర్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక తిప్పలు
- ఇళ్లొచ్చిన ఆనందం కంటే అప్పుల బాధలే ఎక్కువ


● ఇళ్ల నిర్మాణం పూర్తయి, గృహ ప్రవేశాలు జరిగిన ఇళ్లు


తెనాలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా కింద మొదటి విడత కింద 509 లేఔట్లలో 1,30,148 ఇళ్ల, రెండో విడత కింద మరో లక్షకు పైగా ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే వీటిలో మొదటి విడత 2023కే పూర్తికావాలి. కానీ వీటిలోనూ ఇంకా నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు రెండువేలకు పైగా ఇళ్ల పూర్తయ్యాయని, వీటికి బిల్లులన్నీ మంజూరయ్యాయని అధికారులు చెబుతుంటే, లబ్ధిదారులు మాత్రం ఇంకా ఒక బిల్లు పడలేదంటున్నారు. అయితే ఒక ఇంటికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటావరకు బిల్లులు పడిపోతే, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా మాత్రం ఆలస్యమవుతోంది అనేది అధికారుల మాటే. అంటే సొమ్ము కేంద్రానిదైతే, సోకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం బాగానే చేసేసింది.

ఇంటికిచ్చే నిధులు ఎంతంటే..

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు ఇళ్ల నిర్మించుకోటానికి నిధులు మంజూరు చేస్తుంది. వీటినే రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపికచేసి నిధులు విడుదల చేస్తుంది. అయితే దీనిలో ఒక్కో ఇంటికి ఇవ్వాల్సింది రూ.1.80 లక్షలయితే, దీనిలో రూ.1.50 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే, మిగిలిన రూ.30వేలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వ వాటాకింద రాష్ట్రాలు మంజూరు చెయ్యాలి. ఇది కూడా అర్బన్ కేంద్రాల్లో మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.5 లక్షలు కేంద్ర ఇస్తుంటే, మిగిలిన రూ.30వేలకు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద 90 రోజులు పనిదినాలను కేటాయించి, నిర్మాణానికి సంబంధించి పేదలతో చేయించుకున్న పనికి ఆ మొత్తాన్ని మంజూరు చేస్తారు. ఇంతవరకు గ్రామీణ ప్రాంతాల్లో బాగానే ఉంది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో మాత్రం లబ్ధిదారులకు ఇబ్బంది వచ్చిపడింది. ఈ చివరి విడత కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చెయ్యాల్సిన మొత్తాన్ని మాత్రం పనులు పూర్తయి, ఇంటిలోకి వెళ్లిన నెలల తర్వాత కూడా వెయ్యకపోవటం విమర్శలకు తావిస్తోంది.

లబ్ధిదారుల ఆందోళన..

కేంద్రం ఇంటి నిర్మాణానికి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం బేస్‌మెంట్ మినహా పిల్లర్లు పైవరకు ఉండవు. అయితే జిల్లాలోని మట్టి స్వభావం ప్రకారం కానీ, ఇక్కడి నిర్మాణాల తీరును బట్టి కానీ లబ్ధిదారులు శ్లాబ్ వరకు పిల్లర్లు అవసరమనే ఆలోచనతోనే నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇవన్నీ చెయ్యాలంటే రూ.1.8 లక్షల నిధులు సరిపోవు. దీనికోసం బేస్‌మెంట్ తర్వాత ఐదు పిల్లర్లు కావాలంటే రూ.35వేలు, 9 పిల్లర్లు కావాలంటే రూ.50 వేలు అవసరమవుతుందని అంచనా వేశారు. దీని ప్రకారం ఇంటినిర్మాణానికి అయ్యే అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని మొదట చెబితే జనం సంబరపడ్డారు. చివరకు డ్వాక్రా సంఘాల ద్వారా ఈ మొత్తాలను రుణం కింద మంజూరు చేయించి లబ్ధిదారుల నెత్తిపై మరో భారాన్నీ ప్రభుత్వం పడేసింది. ఈ డబ్బుకు సంబంధించి నెలవారీ మొత్తాలు చెల్లించటానికే ఇబ్బందయితే, అప్పులుచేసి తెచ్చిన డబ్బుతో ఇళ్ల నిర్మించేసుకుంటే, వాటికి చివరకు రావలసిన రూ.30వేల బిల్లును కూడా ప్రభుత్వం వేయకపోవటం, వీటికి సంబంధించి ఒక్క ప్రకటన కూడా చేయకపోవటంతో పట్టణ ప్రాంతాల్లో ఉండే అధికార పార్టీ నేతలే సమాధానం చెప్పలేక ఇబ్బందిపడుతున్న పరిస్థితి. అయితే తాజాగా ఐదు నెలలకు ముందు పూర్తయిన ఇళ్లకు సంబంధించిన కొద్దిపాటి బిల్లులు మాత్రం వేశారని, ఆ తర్వాత పూర్తయిన ఇళ్లకు బిల్లుల విషయం మాత్రం నోరు మెదపటంలేదని అంటున్నారు. రానున్నది ఎన్నికల కాలం కావటంతో ఎప్పటికి అందుతాయోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




వైఎస్, జగన్ ఫొటోలతో ఉన్న ఇళ్లపై వాటన్నిటినీ తీసేసి ఆ స్థానంలో కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకనుగుణంగా ఉన్న వివరాలతో కూడిన బోర్డు

రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల ఎప్పటికో!

ఒక ఇంటి నిర్మాణం చేపట్టాక పునాదులు, బేస్‌మెంట్, గోడలు, శ్లాబ్, తర్వాత ఫినిషింగ్ పనులకు బిల్లులను ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తుంది. అయితే శ్లాబ్ పూర్తయ్యే వరకు అన్ని విడతల వరకు డబ్బు బాగానే పడిందని, చివరి ప్లాస్టింగ్ బిల్లు రూ.30వేలు మాత్రం నెలలు గడుస్తున్నా పడటంలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అయితే అధికారులు కూడా అవి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాకావటం వల్ల ఆలస్యమవుతుందని లబ్ధిదారులకు నచ్చచెబుతున్నారే కానీ, వాటి మంజూరు విషయంలో ఏమీ చేయలేకపోతున్నారనేది వారి ఆవేదనే. తెనాలి మండలం నేలపాడులో రామకోటమ్మ అనే లబ్ధిదారు, రూరల్ పరిధిలోని లేఔట్‌లలోని సుజాత, మరియమ్మ, సుగుణకుమారి, మరికొందరు తమ ఇళ్లు పూర్తయి మూడు నెలల నుంచి ఆరు నెలలయినా ఇంతవరకు బిల్లు పడలేదని వాపోతున్నారు. హౌసింగ్ కార్యాలయానికి అనేకసార్లు తిరిగినా ఫలితం లేకపోయిందని, చేసేదిలేక వదిలేశామని చెప్పారు.


- సభ విజయవంతానికి పలు కమిటీల ఏర్పాటు
- జనసేన, బీజేపీ నేతలకు కూడా కమిటీల్లో బాధ్యతలు
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా నేతలందరికీ కమిటీల్లో చోటు



దద్దరిల్లేలా..

● ప్రతిష్ఠాత్మకంగా చిలకలూరిపేట బహిరంగ సభ

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం - బీజేపీ - జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో విడుదల కోసం చిలకలూరిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను టీడీపీ రాష్ట్ర నాయకత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది. ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేట నియోజకవర్గంలోని బొప్పూడి వద్ద జరగనున్న ఈ సభని కనీవిని ఎరుగని రీతిలో బ్రహ్మాండంగా నిర్వహించాలని నిర్ణయించింది. తొలుత టీడీపీ - జనసేన సభగా దీనిని నిర్వహించాలని భావించారు. అయితే రెండు రోజుల క్రితం బీజేపీతో పొత్తు కుదరడంతో మూడు పార్టీల ఉమ్మడి సభగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. అందుకు ఆయన సమ్మతించిన దృష్ట్యా రానున్న ఆది వారం సభని గ్రాండ్ సక్సెస్ చేసేందుకు పలు కమిటీలను నియమించారు. ఈ సభ ద్వారా ఎన్నికల ప్రభంజనానికి శ్రీకారం చుట్టాలని చంద్రబాబు భావిస్తూ కమిటీల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు.



ప్రగతికి నవత బాపట్లకు భవిత స్పెషల్ బుక్‌లెట్ ను నేటి సంచికతో అందుకోండి

కీలకమైన సమన్వయ కమిటీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారు రాజేష్, జనసేన నుంచి గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, చల్లపల్లి శ్రీనివాస్, బీజేపీ నుంచి పాతూరి నాగభూషణం, ఎస్.దయాకర్‌రెడ్డిని నియమించారు. ఇదేవిధంగా వేదిక నిర్వహణ, సభా ప్రాంగణం, ఆహారం, తాగునీరు, పబ్లిక్ కో-ఆర్డినేషన్, మీడియా, వసతి సదుపాయాలు, పార్కింగ్, వాలంటీర్ కో-ఆర్డినేషన్, రవాణ, నగర అలంకరణ, వైద్య సదుపాయాలు, ప్రథమచికిత్స, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీలను ఏర్పాటు చేశారు. వీటిల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులకు కీలకమైన బాధ్యతలు కేటాయించారు. వారిని మంగళవారం నుంచే సభాస్థలి వద్దకు వెళ్లి ఏర్పాట్లు చూసుకోవాల్సిందిగా ఆదేశించారు.

ఎంపీ అభ్యర్థులకు బాధ్యతలు

గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు తో పాటు ఇన్‌ఛార్జ్‌లు బి.రామాంజనేయులు, నసీర్ అహ్మద్, చదలవాడ అరవిందబాబు, కోవెలమూడి నానిలకు నగర అలంకరణ కమిటీలో బాధ్యతలు కేటాయించారు. అలానే బీజేపీ గుంటూరు పశ్చిమ నేత వల్లూరు జయప్రకాష్ నారాయణని కూడా ఇదే కమిటీలో నియమించారు. చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ నాయకులు తాతపూడి గణేష్, గరికపాటి శివశంకర్‌లను వసతి సదుపాయాల కమిటీలో నియమించారు. దాదాపుగా 10 లక్షలమందితో ఈ భారీ బహిరంగ సభని నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయించిన దృష్ట్యా ఆ మేరకు చర్యలు చేపట్టారు.



“ఊరట..” దక్కేనా?

- ఐదేళ్లలో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- భారం మోయలేక కుదేలవుతున్న సామాన్య జనం
- విద్యుత్ భారం తగ్గించే దిశగా కేంద్రం అడుగులు
- పీఎం సూర్యఘర్ పేరిట 300 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం

రూ.78,000 వరకు సబ్సిడీ

ఈ పథకం కింద గృహ వినియోగానికి సంబంధించి ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లలో 2 కిలోవాట్ల వరకూ మొత్తం ఖర్చులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం అందిస్తుంది. 2 నుంచి 3 కిలోవాట్ల ప్లాంట్లకు 40 శాతం అందిస్తుంది. ఒక కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే రూ.30,000, 2 కిలోవాట్ల ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే రూ.60వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుంది. 3 కిలోవాట్ల ప్లాంటును ఏర్పాటు చేసుకుంటే రూ. 78వేలు సబ్సిడీ కింద అందిస్తారు.

కేంద్ర ప్రభుత్వం ఆమోదం

ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఫిబ్రవరి 16న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రణాళికకు ఆమోదం లభించింది. ఈ పథకం కింద దేశంలోని కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాట్లను ఏర్పాటు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.76 వేల కోట్ల వరకూ కేటాయించేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా ఒక కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో సబ్సిడీ అందించనుంది.

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడు భరించలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు తారెత్తిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై మోయలేని భారం వేసింది. చార్జీల పెంపుతోపాటు సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో మరింత భారం మోపింది. ఫలితంగా నెలసరి విద్యుత్ బిల్లు దాదాపు 10 రెట్లు పెరిగింది. గతంలో 200, 300 రూపాయలతో పోయే బిల్లు ప్రస్తుతం 2 నుంచి 3 వేలకు పెరిగింది. దీంతో వారు అల్లాడిపోతున్నారు. దానికితోడు అధిక విద్యుత్ వినియోగం పేరుతో సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం అడ్డగోలుగా కోతలు పెడుతోంది. దీంతో ఏం చేయాలో కూడా తెలియని స్థితిలో అల్లాడిపోతున్నారు. సరిగ్గా అలాంటి సమయంలోనే కేంద్రం ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ప్రతి ఇంటికీ నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందే అవకాశాన్ని కల్పించేలా కొత్త పథకాన్ని రూపొందించింది. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) పథకాన్ని రూపొందించింది.

కర్బన ఉద్గారాల తగ్గింపు దిశగా అడుగులు

ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా సామాన్యులపై విద్యుత్ బిల్లుల భారం భారీగా తగ్గుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా తయారయ్యే విద్యుత్‌ను సొంత అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కమ్‌ల ద్వారా కొనుగోలు చేస్తారు. మిగులు విద్యుత్ ధర డిస్కమ్‌లే వినియోగదారులకు చెల్లిస్తాయి. తద్వారా లబ్ధిదారులు ఆదాయం కూడా పొందవచ్చని కేంద్రం చెబుతోంది. 3 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంటు ద్వారా సగటున ప్రతి నెలా 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ఇలా 25 ఏళ్ల వరకూ ఆ ప్లాంటు పనిచేస్తుంది. అందులో 200 యూనిట్లు వాడుకున్నామనుకుంటే, మిగిలిన వంద యూనిట్లను డిస్కమ్ కొనుగోలు చేసి లబ్దిదారులకు నగదు చెల్లిస్తుంది. ప్లాంటు ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుంది. సబ్సిడీ ఎంత వస్తుంది. అదిపోను లబ్దిదారు ఎంత పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. పెట్టిన పెట్టుబడి ఎన్నేళ్లలో తిరిగి వస్తుంది. ఆ తరువాత మిగిలిన ఏళ్లలో వచ్చే రిటర్న్(లాభం) ఎంత ఉంటుంది. 25 ఏళ్లలో ఎన్ని టన్నుల కార్బన ఉద్గారాలను తగ్గించామో తెలుసుకునేందుకు వీలుగా పోర్టల్‌లోనే ప్రభుత్వం కాలిక్యులేటర్‌ను ఏర్పాటు చేసింది. ఇలా అన్ని అంశాలు ఒకే చోట ఉండేలా పోర్టల్‌ని అధికారులు రూపొందించారు.

- భారీ రాయితీతో గృహ సౌర విద్యుత్ ప్లాంట్లకు ప్రోత్సాహం
- 30 వేల నుంచి 78 వేల వరకూ రాయితీ

ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమయింది. తొలుత 'పీఎంసూర్యఘర్.జీవోవీ.ఇన్' పోర్టల్‌లో లబ్దిదారు పేరు రిజిస్టర్ చేసుకోవాలి. అందుకోసం రాష్ట్రం పేరు, విద్యుత్ సరఫరా చేసే సంస్థ(డిస్కమ్) పేరును ఎంచుకోవాలి. విద్యుత్ కనెక్షన్ కన్సూమర్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీలను ఎంటర్ చేయాలి. తద్వారా రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత వినియోగదారు రిజిస్టర్ చేసిన మొబైల్ నెంబర్‌తో లాగిన్ చేయాలి. అక్కడే రూఫ్‌టాప్ సోలార్ కోసం అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులో అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి. గడిచిన ఆరునెలల్లో వచ్చిన ఏదైనా ఒక కరెంటు బిల్లు ఫోటో అప్‌లోడ్ చేయాలి. ప్లాంట్ లోకేషన్‌ను గూగుల్ మ్యాప్‌లో ఎంపిక చేయాలి. ఆ తరువాత అప్లికేషన్‌ను సేవ్ చేసి సబ్‌మిట్ చేయాలి. అప్లికేషన్ సబ్‌మిట్ చేసిన తరువాత డిస్కమ్ అనుమతులు వచ్చేవరకు ఎదురు చూడాలి. అనుమతి లేదా తిరస్కరణకు 15 రోజుల సమయం పడుతుంది. అనుమతి వచ్చాక లబ్ధిదారుడికి సంబంధించిన డిస్కమ్‌లో నమోదైన విక్రేతల ద్వారా సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ప్లాంట్ ఇన్‌స్టాలేషన్ పూర్తయ్యాక.. ఆ ప్లాంట్ వివరాల్ని పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం అప్లై చేసుకోవాలి. నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత.. డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. తర్వాత పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ రిపోర్టు పొందాక మీ బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ సహా క్యాన్సిల్ చేసిన చెక్‌ను పోర్టల్‌లో సబ్మిట్ చేస్తే.. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.

తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా..

గతంలో ప్రధానమంత్రి సూర్యోదయ యోజన కింద అమలు జరిగిన ఈ పథకానికి ఒక్కో కిలోవాట్‌కు రూ.18000 చొప్పున సబ్సిడీ ఇచ్చారు. అలా ఒక్క కిలోవాట్ ప్లాంటుకు రూ.18వేలు, 2 కిలోవాట్ల ప్లాంట్లకు రూ.36వేలు, 3 కిలోవాట్ల ప్లాంట్లకు రూ.54వేలు సబ్సిడీ ఇచ్చారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన లేదు. ఫలితంగా సబ్సిడీని కేంద్రం అమాంతం పెంచింది. అయినప్పటికీ ప్రజలు ముందుకు వస్తారా? లేదా అన్నది అనుమానంగానే వుంది. రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఇన్‌స్టాల్ చేయడం ఖర్చుతో కూడుకున్న అంశం కావడమే అందుకు కారణం. ఈ సమస్యను కూడా అధిగమించేందుకు స్వయంగా ప్రభుత్వమే రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తోంది. బ్యాంకుల ద్వారా 7 నుంచి 12 శాతం అతి తక్కువ వడ్డీతో ప్లాంటు ఖర్చులో 90 శాతం రుణ రూపంలో అందించేందుకు అవకాశం కల్పిస్తోంది. 2నుంచి 10 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాలు అందించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంది.


ఓలేరు వద్ద నదిలో ఇసుకను ట్రిప్పర్‌లోకి పోస్తున్న జేసీబీ

ఇసుక దందా

- ఓలేరు వద్ద నదిలో అక్రమంగా తవ్వకాలు
- ఇసుక, బుసుకను అమ్ముకుంటున్న అధికార పార్టీ నేతలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్నరైతులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

భట్టిప్రోలు, మార్చి 11: మండలంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతం ఓలేరు వద్ద అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ అండదండలతో నదిలో నుంచి ఇసుక, బుసుకను తరలించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు జరుపుతూ లక్షలాది రూపాయిలను అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. రోడ్లుగా చదును చేసుకుని మరీ నది మధ్యలోకి వెళ్ళి తవ్వకాలు చేస్తున్నారని, తవ్వకాల వల్ల 12 అడుగుల మేర గోతులు ఏర్పడ్డాయని సమీప పంట పొలాల రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తవ్వడం వలన వరదలు వచ్చినప్పుడు తమ పంట పొలాలు నదిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా జేసీబీలతో తవ్వకాలు చేస్తూ భారీ టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక, బుసుకను తరలించుపోతున్నారని అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఇసుకాసురులకు కొమ్ముకాస్తున్నారని రైతాంగం తెలిపారు. నదీ గర్భంలో కిలోమీటర్ల మేర నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ మైనింగ్ అధికారులు అటు వైపుగా కన్నెత్తికూడా చూడకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సెబ్, పోలీస్, రెవెన్యూశాఖల అధికారులు పట్టించుకోకపోవడం వలన నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక, బుసుకను తరలించుకుపోతున్నారు. అక్రమ తవ్వకాల వలన తమ పంట పొలాలు విరిగిపడి నదిలో కలిసిపోతాయని ఇటీవల రైతాంగం తవ్వకాలను అడ్డుకోవడం జరిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్వకాలను నిలుపుదల చేపట్టి అక్రమార్కులపై కేసులు నమోదు చేయించాలని రైతాంగం కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా తమ సిబ్బందిని పంపించి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు.

అప్రమత్తతతో బాధ్యతలు నిర్వహించాలి

● కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల, మార్చి 11: రానున్న ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు కీలకభూమిక పోషించాల్సి ఉంటుందని, ఆ దిశగా జిల్లాలోని ఆర్‌వోలు అందరు పూర్తి అప్రమత్తతో బాధ్యతలు నిర్వహించాలని జిల్లాకలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌తో కలిసి ఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదలౌతుందని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత రిటర్నింగ్ అధికారులు నేరుగా ఎన్నికల సంఘానికి అనుసంధానమైన ఉంటారనే విషయం గుర్తెరగాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. నామినేషన్ దశ నుంచి కౌంటింగ్ ప్రకియ ముగిసేవరకు అన్ని దశల్లో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతివిషయంలో చెక్‌లిస్ట్ తయారు చేసుకొని అందుకు అనుగుణంగా బాధ్యత నిర్వహిస్తే, పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్‌వోలు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.22(మంగళవారం)
సహారీ (ఉదయం) 5.01 (బుధవారం)



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరిలో వైసీపీలో వర్గపోరు

కనిగిరి, మార్చి 11 : కనిగిరి వైసీపీలో వర్గపోరు రగులుతూనే ఉంది. పట్టణంలోని 7వ వార్డు కొత్తూరులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఆ వార్డు కౌన్సిలర్ తమ్మినేని సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఇన్‌చార్జి దద్దాల నారాయణకు ఆహ్వానం పలకడంతోపాటు శిలాఫలకంలో ఆయన పేరును కూడా వేశారు. వైసీపీ కనిగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఆయన విగ్రహావిష్కరణకు రాకపోవడంతో వర్గపోరు మరోసారి బయటపడింది. అదేవిధంగా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని ఆహ్వానం పలికిన సమయంలో ఎన్నికల అనంతరం విగ్రహావిష్కరణ పెట్టుకోవాలని కౌన్సిలర్ సుజాతకు ఆయన సూచించినా, కార్యక్రమానికి మాత్రం హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు, దేవకి సత్యవతి, రామనబోయిన ప్రశాంతి, రామనబోయిన శ్రీనివాసులు, దేవరాజ్, రాజా, ఏడుకొండలు, కోఆప్షన్ చింతం శ్రీనివాసులు, రంగనాయకులరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, మరికొంతమంది ఎమ్మెల్యే అనుచరవర్గం హాజరుకాగా 13వ వార్డు కౌన్సిలర్ రిజ్వాన్‌బేగంతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు హాజరు కాలేదు.

ఎమ్మెల్యే నిష్క్రమణ అనంతరం

హాజరైన జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గుంటక

ఎమ్మెల్యే బుర్రా వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి నిష్క్రమించి కందుకూరు వెళ్లిపోయినట్లు తెలుసుకున్న జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి వైఎస్సార్ విగ్రహం వద్దకు రావడం గమనార్హం. ఈ సంఘటనతో ఎమ్మెల్యే బుర్రాకు, ఇన్‌చార్జి దద్దాలకు మధ్య అంతర్గత పోరు బహిర్గతమైంది.

పది పరీక్షలకు ప్రశ్నపత్రాలు సిద్ధం

ఒంగోలు(విద్య), మార్చి 11 : జిల్లాలో ఈనెల 18నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రశ్నాపత్రాలు సిద్ధమయ్యాయి.జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 30928 మంది హాజరవుతుండగా వారిలో 29449 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 1479 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు అనుకూలంగాఉండేలటా 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు ఉపయోగించే ప్రశ్నాపత్రాలను ఆది, సోమవారాల్లో జిల్లాలోని 38 పోలీస్ స్టేషన్లలో భద్రపర్చారు. మొత్తం 12 రూట్లలో పోలీసు భద్రతతో ఆయా పోలీస్ స్టేషన్లకు పశ్రాపత్రాలను తరలించి భద్రపర్చినట్లు డిఇఓ సుభద్ర, ప్రభుత్వ పరీక్షల కమీషనర్ కే శివకుమార్‌లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఉలవపాడు/మార్టూరు, మార్చి 11 : మండలంలోని చాగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బాజీరెడ్డి కథనం మేరకు... ప్రకాశం జిల్లా మార్టూరు మండలం కే రాజుపాలెం గ్రామానికి చెందిన నువ్వుల సాయితేజ (26) తన స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో చాగొల్లు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి మామిడి చెట్లకు పురుగు మందు పిచికారి చేసేందుకు ట్యాంకర్‌లో నీరు నింపుకొని ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయితేజ రోడ్డుపై పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ అక్కడకు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తల్లి దండ్రులు నువ్వుల శ్రీను, సుధా లు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. వారికి సాయితేజ్‌తోపాటు కుమార్తె నాగలక్ష్మి ఉన్నారు. ఉలవపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో మృత దేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం పోలీసులు అక్కడకు తరలించారు. మంగళవారం పోస్టు మార్టమ్ నిర్వహించనున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- కందులూరు వద్ద ఘటన

- యువకులలో ఒకరి పరిస్థితి విషమం

టంగుటూరు, మార్చి 11 : ముగ్గురు యువకులతో వేగంగా వెళ్తున్న మోటారు సైకిల్ అదు పు తప్పి పడిపోవడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, రెండో యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఇక మూడో యువకుడు తీవ్రంగా గాయపడి ప్రమాదకర పరిస్థితుల్లో ఆసుపత్రిలో చికి త్స పొందుతున్నారు. ఈ సంఘటన ఆదివారం జరిగినప్పటికీ సోమవారం వె లుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే... కందులూరుకు చెందిన పైనం రిమోరియో (20), దార్ల సుశాంత్(18), దార్ల సూర్యలు చీరాల వెళ్లేందుకు మోటారు సైకిల్‌పై బయలుదేరారు. వీరు కందులూరు నుంచి సూరారెడ్డిపాలెం మార్గంలో గ్రామం దాటి కొంచెం ముందుకు వచ్చే క్రమంలో మలుపు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయింది. దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకుల్లో రిమోరియో అక్కడికక్కడే మృతి చెందగా, సుశాంత్, సూర్యలు తీవ్రంగా గాయపడ్డారు. దారినిపోయే వారు వారిని గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారమే సుశాంత్ కన్నుమూశాడు. సూర్య ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం పోలీసులంతా సిద్ధం సభకు మేదరమెట్ల వెళ్లడంతో కందులూరు వద్ద జరిగిన ప్రమాద సంఘటన బయటపడలేదు. మృతులు ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతుండగా, సూర్య ఇంటర్ చదువుతున్నాడు. అందరూ అన్నదమ్ముల పిల్లలు కావడంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒంగోలు ఆసుపత్రి నుంచి టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు.. ప్రమాద సంఘటనపై ఎస్సై నాగేశ్వరరావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యథేచ్ఛగా కుంట పోరంబోకు ఆక్రమణ

దర్శి, మార్చి 11 : దర్శి ప్రాంతంలో ప్ర భుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ఆక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు ఆక్రమించి సొంతం చేసుకుంటున్నారు. ఈ దారుణాలు దర్శి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా సోకాయి. తాజాగా దర్శి-పొదిలి రోడ్డులోని కుంట పోరంబోకు భూమిని ఆక్రమించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల కుంట పోరంబోకు ఉంది. ఆ భూమి దశలవారీగా ఆక్రమణలకు గురవుతూ వ చ్చింది. గతంలో కొందరు సాగు చేసుకుంటూ అందులో కొంత భూమిని రికార్డుల్లోకి ఎక్కించుకొని అనుభవిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఖాళీగా ఉన్న రెండు ఎకరాలను ఆక్రమించుకొని బాగుచేసుకుంటున్నారు. ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. ఈ కుంట పోరంబోకు భూమి విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ప్ర స్తుతం చదును చేస్తున్న భూమిని కొన్నేళ్లుగా రాజంపల్లికి చెందిన కొంతమంది సాగు చేసుకుంటున్నామని ఆ భూమిలోకి దిగారు. అదేవిధంగా తూర్పువెంకటాపురానికి చెందిన కొంతమంది అందులో కొంత భూమి తాము కూడా సాగు చేసుకుంటున్నామని అందులోకి దిగడంతో వివాదం నెలకొంది. అప్పుడు రెవెన్యూ అధికారులు ఇరువర్గాలను పిలిచి మాట్లాడారు. రికార్డుల ప్రకారం కుంట పోరంబోకు భూమి అయినందున ఎవ్వరికీ హ క్కు ఉండదని ఎవరూ భూమిలో ది గవద్దని హెచ్చరించారు. భూమిలో ఆ సమయంలో హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును పీకిపడేసి ప్రస్తుతం కొంతమంది మళ్లీ ఆక్రమించి ఎక్స్‌కవేటర్‌తో చదు ను చేస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి తహసీల్దార్ సుజాత దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత భూమిలోకి ఎవరూ వెళ్లకుండా చూడాలని వీఆర్వోను ఆదేశించారు. దీంతో అక్కడకు వెళ్లిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను అడ్డుకున్నారు. తాత్కలికంగా అడ్డుకున్నా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మరింత బలం

- తిరిగి తెలుగుదేశం పార్టీలోకి మాగుంట కుటుంబం
- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ అనుచరుల చేరిక
- జిల్లా నాయకులతో ఎంపీ మంతనాలు
- చిలకలూరిపేట సభలో పాల్గొననున్న శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి

జిల్లాలో ప్రత్యేకించి ఒంగోలు లోక్‌సభ పరిధిలో ప్రజాగౌరవం ఉన్న మాగుంట కుటుంబం తిరిగి తెలుగుదేశం పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. ఆ కుటుంబ ప్రతినిధి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అందులోభాగంగా సోమవారం ఉదయం టీడీపీ నాయకులతో ఆయన తన నివాసంలో భేటీ అయ్యారు. ఈనెల 17లోపు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరటం ఆ తర్వాత ప్రధాని పాల్గొనే చిలకలూరిపేట సభకు ఆయన హాజరుకావటం ఖాయమని తేలిపోయింది. మాగుంట కుటుంబంతోపాటు గత 30 ఏళ్లుగా వారిని అనుసరిస్తున్న పలువురు వైసీపీ కిందిస్థాయి నాయకులు, ముఖ్యులు, స్థానిక సంస్థల బాధ్యులు కూడా టీడీపీలో చేరబోతున్నారు. నేడో రేపో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో మాగుంట కుటుంబం టీడీపీలో చేరబోవటం ఆ పార్టీకి సానుకూల అంశం కాగా వైసీపీకి బిగ్ షాకే.



ఒంగోలులోని మాగుంట నివాసంలో ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ఇన్‌చార్జులతో సమావేశమైన ఎంపీ శ్రీనివాసులరెడ్డి, రాఘవరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెలుగుదేశం పార్టీకు మరింత ఊపునిచ్చేలా అడుగులు పడుతున్నాయి. ఆత్మగౌరవం లేని వైసీపీలో ఇమడలేక ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తమ కుటుంబం రాజకీయాల్లోనే ఉంటుందని చెప్పిన ఆయన ఏ పార్టీలో చేరతారనే విషయాన్ని ఆ రోజు స్పష్టం చేయలేదు. తెలుగుదేశం పార్టీలోనే చేరబోతున్నట్లు కనిపిస్తున్నా బీజేపీలో కూడా చేరే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. నియోజకవర్గానికి ఎంత ప్రాధాన్యత ఇస్తారో అంతే స్థాయిలో ఢిల్లీ రాజకీయాలకు ఆయన ప్రాధాన్యత ఇస్తుంటారు. ఆయన స్థానికంగా ఏ పార్టీలో ఉన్నా, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారితో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండేవారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీకి రాజీనామా చేసి ఏ పార్టీలో చేరేది ప్రకటించకపోవటంతో బీజేపీలో చేరవచ్చనే ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటికి సోమవారం ఆయన తెరదించారు. ఒంగోలులోని తన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో తనను కలిసేందుకు వచ్చిన నేతలకు అల్పాహార విందు ఇచ్చారు. వారితో సుదీర్ఘ మంతనాలు జరిపిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమ కుటుంబం టీడీపీలో చేరబోతున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

రాఘవరెడ్డినే పోటీ

ఇటీవల తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై నిర్వహించే ఫోన్ సర్వేలో ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట రాఘవరెడ్డి అయితే ఎలా ఉంటుందనే అభిప్రాయ సేకరణ చేశారు. ఆ తర్వాత మరోసారి మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీ అభ్యర్థి అయితే మీకు అంగీకారమేనా? అంటూ మరో సర్వే చేశారు. దీంతో కూడా మాగుంట విషయంలో టీడీపీలో ఎం జరుగుతుందో అనే అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఆ విషయంపై ఇప్పటికీ టీడీపీ అధిష్టానంలో స్పష్టత లేదని కూడా అంటున్నారు. అయితే మాగుంట మాత్రం సోమవారం టీడీపీ నాయకులతో భేటీ అనంతరం లోక్‌సభ నుంచి తన కుమారుడు రాఘవరెడ్డి పోటీలో ఉంటారని ప్రకటించారు. అవసరమైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్పా లోక్‌సభకు పోటీ చేయనని తేల్చిచెప్పారు. ఆ విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా తెలిపినట్లు ప్రకటించారు. అంతేకాక చంద్రబాబు సూచనకు అనుగుణంగా చిలకలూరిపేట సభలో కాని ఆ ముందు గాని పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

సమన్వయంతో ముందుకుసాగుదాం

చిలకలూరిపేట సభ కన్నా ముందే టీడీపీలో చేరినా ఆ సభకు హాజరై టీడీపీ, జనసేన, బీజేపీల కలయికను స్వాగతించాలని నిర్ణయించుకున్నారు. కాగా మాగుంటతోపాటు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీ వైసీపీలోని పలువురు ప్రముఖులు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. వారిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు వివిధ హోదాల్లో వైసీపీ పదవులు ఉన్న వారు ఉన్నారు. అలా పార్టీలోకి వచ్చే వారిని సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని సోమవారం మాగుంటను కలిసిన టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. వేరే ప్రాంతంలో వేరే కార్యక్రమంలో ఉన్న కనిగిరి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి తొలినుంచి మాగుంటతో సన్నిహిత సంబంధాలు ఉన్నందున ముందుగానే స్వాగతం పలికారు. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో మాగుంటను కలిసి స్వాగతం పలికిన వారిలో సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థులు బీఎన్.విజయ్‌కుమార్, ఎరీక్షన్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, గిద్దలూరు, మార్కాపురం, చీరాల టీడీపీ ఇన్‌చార్జిలు అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి ఎంఎం.కొండయ్యయాదవ్‌లతో పాటు ఇతర పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు.

ఎన్నికల వేళ ఎర..!

- కోర్టులో ఉన్న స్థలంలో పట్టాలు ఇచ్చేందుకు పారిశుధ్య కార్మికులకు ప్రలోభం
- ఇన్నాళ్లూ వదిలేసిన వైసీపీకి వారిపై అకస్మాత్తుగా ఎందుకీ ప్రేమ
- హడావుడిగా స్థల పరిశీలన చేసిన రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 11 : ఇరవై ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికులకు పట్టాలు ఇచ్చే అంశాన్ని పట్టించుకోని వైసీపీ నేతలు ఎన్నికల వేళ వారిపై అకస్మాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు ఈ ఎత్తుగడ వేశారని కొందరు విమర్శిస్తున్నారు. వైసీపీ నేతల ఒత్తిడితో రెవెన్యూ, కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు హడావిడిగా స్థల పరిశీలన చేయడం గమనార్హం. వివరాల్లోకెళితే... నగర పరిధిలోని కమ్మపాలెం సమీపంలోని దారాలకుంటలో సర్వేనెం. 1137లోని సుమారు రెండెకరాల స్థలంలో కొన్నేళ్లుగా ఒంగోలు నగరపాలక సంస్థ కార్మికులు తాత్కాలిక గృహాలు నిర్మించుకుని ఉంటున్నారు. ఇది లా ఉండగా, గతంలో రజకుల కోసం కేటాయించిన కుంట కాగా, ఆ తర్వాత కాలనుగుణంగా అక్కడ రజకుల జీవన వృత్తి నిలిచిపోయింది. అప్పట్లో కొందరు వ్యక్తులు ఈ స్థలానికి పట్టాలు పుట్టించి పలువురికి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఆ తర్వాత కొందరు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ స్థలంపై వివాదం నడుస్తూనే ఉంది. ఇదిలా ఉండగా గతంలో రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ఆ స్థలం ఖాళీ చేయాలని అక్కడ నివస్తున్న పారిశుధ్య కార్మికులకు నోటీసులు జారీ చేశారు. నేటికీ ఆ వ్యవహారం తేలకపోగా, ప్రస్తుతానికి కార్మికులే నివాసం ఉంటున్నారు. గతంలో రెండుసార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు, నేడు వారికే పట్టాలు ఇస్తామంటూ హడావిడి చేయడం ఎన్నికల వేళ వైసీపీన ఎత్తుగడగా భావిస్తున్నారు. అతి త్వరలోనే ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పారిశుధ్య కార్మికులపై ప్రేమ పుట్టుకురావడంపై అం ద రూ ముక్కున వేలేసుకుంటున్నారు.

అధికారుల పరిశీలన

సోమవారం జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, కార్పొరేషన్ కమిషనరు, తహసీల్దారు, ఇరిగేషన్ ఎస్ఈలు దారాలకుంటకు వెళ్లి అక్కడి వారితో మాట్లాడారు. ఎంతమంది ఉన్నారు? ఎన్ని కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారనే వివరాలు సేకరించడంతోపాటు, వారి ఆధార్, రేషన్ కార్డులను పరిశీలించారు. త్వరలోనే పట్టాలు ఇచ్చే ప్రక్రియ చేపడతామని అధికారులు చెప్పారు. ఇటీవల మంజూరైన జగనన్న ఇళ్ల పట్టాలు అక్కడ నివసించే 13 మంది కార్మికులకు మంజూరు కాగా, వారిని వారికి కేటయించిన స్థలానికి వెళ్లాలని సూచించారు. మిగిలిన వారికి పట్టాలు త్వరలోనే ఇస్తామని చెప్పడంతో అధికారుల సూచనలను కార్మికులు అంగీకరించలేదు. అందరికీ ఒకే చోట ఇవ్వాలని, గడిచిన ఇరవై ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని వారు తెలిపారు. దీనిపై అధికారులు త్వరితగతిన సర్వే చేసి సమగ్రమైన నివేదిక ఇవ్వాలని జేసీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



కుంట స్థలాలను పరిశీలిస్తున్న జేసీ

అప్పుడూ అదే హడావుడి

దారాల కుంటలో పారిశుధ్య కార్మికుల పట్టాల ఇచ్చే వ్యవహారం గడిచిన కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనూ హడావిడిగా నడిచింది. వైసీపీకి ఓటు వేస్తే అందరికీ పట్టాలు ఇస్తామని మభ్యపెట్టారు. ఆ తర్వాత పాలకవర్గం ఏర్పాటై 43 మంది వైసీపీకి చెందిన వారే ఉన్నారు. ఏనాడు పట్టించుకోని వారు తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు మరోసారి పట్టాల పేరుతో హడావిడి చేయడంపై ఎన్నికల వైసీపీ గెలుపు కోసం అధికారులు ఇలాంటి హడావిడి చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమై స్థానికంగా నివాసం ఉండే కార్మికులు మాట్లాడుతూ ఇక్కడ సుమారు 120 కుటుంబాలు ఉన్నాయని, ఒక్కో కుటుంబానికి ఒకటిన్నర సెంటు భూమి ఇవ్వాలని తాము తహసీల్దారుకు విన్నవించామని చెబుతున్నారు.

ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- ఎస్‌బీఐ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ వెంటనే ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. వాటి వివరాల వెల్లడిపై నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు సీపీఐ కార్యాలయం నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌బీఐ బ్రాంచి వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వచ్చే నగదు ఉపయోగించుకొని అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు కార్పొరేట్ శక్తులు వారి నల్లధనాన్ని ఇలా వైట్‌గా మారుస్తూ ఎన్నికల అనంతరం తగిన విధంగా లబ్ధిపొందేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈనెల 15లోపు బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆర్థిక లబ్ధికోసమే కార్పొరేట్ శక్తులు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో నగదు వేస్తున్నా యన్నారు. ఈ నగదును వినియోగించుకొని దొడ్డిదారిలో అధికారం పొందేందుకు ఆయా రాజకీయ పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్. వెంకట్రావు, పీవీఆర్ చౌదరి, అందె నాసరయ్య ఎస్‌డీ యాసిన్, కే వీరారెడ్డి, వీ హనుమారెడ్డి, ఆర్. రామకృష్ణ, సయ్యద్ మౌలాలి, ప్రభాకర్, రమేష్, విజయ తదితరులు ఉన్నారు.

నెల్లూరు, ప్రకాశం అధ్యాపకులకు శిక్షణ

నెల్లూరు (విద్య), మార్చి 11 : నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన జంతు శాస్త్ర, జీవసాంకేతిక శాస్త్ర, జీవరసాయన శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ అధ్యాపకులు ఆయా సబ్జెక్టుల్లో నూతన అంశాలను, బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ప్రయోగాత్మకమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులందరూ ఈనెల 16వతేదీ వరకు నిత్యం హాజరై ఆయా అంశాలపై శిక్షణ పొందాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, రీసోర్స్‌పర్సన్లు డాక్టర్ శ్రీరంజని, డాక్టర్ ఎస్ ప్రియాంక, డాక్టర్ ఎం.గురుశేఖర్, పీఆర్వో జోజి పాల్గొన్నారు.

కార్మికుడు మృతికి బాధ్యుడిగా

జగన్‌పై కేసు పెట్టండి

- మురళి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి
- రిమ్స్ వద్ద వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన టీడీపీ నేతలు
- రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్



జనార్దన్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న మృతుడి తల్లి


ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 11 : మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభలో మరణించిన పారిశుధ్య కార్మికుడు ఊదరగొడి మురళీకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకుని, న్యాయం చేయాలని, మురళీ మృతికి కారణమైన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై ఏ1గా కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలులోని రిమ్స్ వద్ద మృతుని కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ సభ విజయవంతం కోసం ఇళ్లలో ఉండే వారిని కూడా బలవంతంగా తీసుకెళ్లారన్నారు. అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకుని షై వేని దిగ్బంధించారని ధ్వజమెత్తారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే అతను చ ని పో య‌ా డ ని చెప్పారు. గతంలో కందుకూరులో జరిగిన చంద్రబాబు నాయుడు సభలో జరిగిన తొక్కిసలాటలో కొందరు ప్రాణాలు కోల్పోతే అప్పట్లో ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుపై కేసుపెట్టారని, అదే చట్టాన్ని వైసీపీకీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కుటుంబానికి ఆధారమైన మురళీకృష్ణ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆయన భార్యకు ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇద్దరు పిల్లలను చదవించాలని దామచర్ల డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు టీడీపీ పోరాడుతోందన్నారు. జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ వైసీపీ భజన సభ కారణంగా పారిశుధ్య కార్మికుడు మరణించడం బాధాకరమన్నారు. సిద్ధం పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేయడానికి జగన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. ఒంగోలుకు చెందిన కార్మికుడు మరణిస్తే ఇంతవరకు ఆ కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాలినేని నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మార్చురీ వద్ద నిరసన చేపట్టారు. మురళీ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మురళి కుటుంబాన్ని ఆదుకుంటాం-బాలినేని

కాగా మురళీకృష్ణ కుటుంబాన్ని వైసీపీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మురళి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, అలాగే ఆయన భార్యకు ఉద్యోగం, సొంతిల్లు మంజూరు చేస్తామని తెలిపారు. తన వ్యక్తిగతంగా సొంత నిధులు రూ. 3లక్షలు అందజేశారు.

వైసీపీలో ప్రొటోకాల్ వివాదం

నాగులుప్పలపాడు, మార్చి 11: అధికార వైసీపీలో ప్రొటోకాల్ వివాదం నెలకొంది. మండలంలోని ఈదుమూడిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవాల కోసం అంతా సిద్ధం చేశారు. మూడు శిలాఫలకాలపైనా అదేగ్రామానికి చెందిన మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు పేరును ముద్రించకపోవడంతో గొడవ మొదలైంది. సోమవారం సాయంత్రం మంత్రి మేరుగ నాగార్జున ఆయా భవనాలను ప్రారంభించేందుకు గ్రామస్థాయి నాయకులు ఏర్పాట్లను పూర్తిచేసి శిలాఫలకాలను సిద్ధం చేశారు. తీరా చూస్తే కనకారావు పేరు లేదు. మంత్రి సోమవారం రాత్రి 8గంటల సమయంలో ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. మొదట వైఎస్సార్ విగ్రహం, బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రధాన భవనాలను ప్రారంభించడానికి బయలుదేరారు. అదే సమయంలో తమ నాయకుడి పేరు శిలాఫలకాలపై లేదంటూ కనకారావు వర్గీయులు అడ్డుకున్నారు.



దీంతో గ్రామ వైసీపీలోని రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సర్పంచ్ బోలే లక్ష్మి, ఆమె భర్త ఆంజనేయులు అక్కడకు చేరకుని మంత్రిని తమ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడకు కూడా కనకరావు వర్గీయులు వెళ్లడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొద్దిసేపు వారు ఆందోళన నిర్వహించారు. అదేసమయంలో కనకరావు అక్కడకు చేరుకుని తమ వర్గీయులకు సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత దళితుడినైన తనను గామానికి చెందిన కొందరు నాయకులు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి బెన్హర్ పేరు శిలాఫలకంపై ముద్రించారని, గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి ప్రొటోకాల్ ఉన్న తన పేరు లేకుండా ప్రారంభోత్సవం ఎలా చేస్తారంటూ ప్రశ్నించారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టానంతోపాటు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు కనకారావు తెలిపారు. ఈ వివాదం మంత్రి మేరుగ నాగార్జునకు తలనొప్పిగా మారింది.

చైర్మన్ కనకారావు పేరు లేని శిలాఫలకం

టీడీపీలో జోష్.. వైసీపీ బేజార్



ఏలూరి సమక్షంలో ఇటీవల టీడీపీలో చేరిన చినగంజాం మండలం మోటుపల్లి సర్పంచ్, ఆయన వర్గీయులు

- ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో భారీగా చేరికలు
- హైదరాబాద్, బెంగళూరులో ఆత్మీయ సమ్మేళనాలు సక్సెస్
- నాయకత్వలేమి నుంచి కోలుకోలేని వైసీపీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తాజా రాజకీయ పరిణామాలలో పర్చూరు నియోజకవర్గంలో టీడీపీలో జోష్ పెరిగింది. ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో ఆ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. ఎన్నికల సమరానికి సన్నద్ధమైన ఏలూరి కూడా గ్రౌండ్ వర్క్ ముమ్మరంగా చేస్తున్నారు. మరోవైపు వైసీపీలో నాయకత్వ సమస్య కుదుటపడలేదు. ఇన్‌చార్జులను మార్చినా అంతర్గత విభేదాలు ముదురుతున్నాయే తప్ప తరగలేదు. దీంతో గ్రౌండ్ లెవల్లో టీడీపీ దూసుకుపోతుండగా, వైసీపీలో అయోమయ స్థితే కొనసాగుతోంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత రమారమి దశాబ్దకాలం పాటు ఆ పార్టీ హవా కొనసాగింది. అప్పట్లో జరిగిన కొన్ని పరిణామాలతో తిరిగి కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. నాయకత్వలేమితో ఉన్న టీడీపీ బాధ్యతలు 2012లో ప్రస్తుత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టారు. తమదైన నడవడిక, రాజకీయ వ్యూహం, అన్నింటికీ మించి ప్రజాసేవలో ఏలూరి ముందుకు దూసుకుపోవడంతో తిరిగి టీడీపీ పటిష్టవంతమైంది. గత ఎన్నికల్లో ఏలూరి విజయం అందుకు దర్పణంపట్టింది. ఆతర్వాత టీడీపీని బలహీన పర్చేందుకు ఎమ్మెల్యే ఏలూరిని టార్గెట్ చేసుకుని జగన్ ప్రభుత్వం అనేక వ్యవహారాలకు పాల్పడింది. అన్నింటినీ అధిగమించిన ఏలూరి కష్టాలలోనూ ప్రజలతో మమేకమవుతూనే ఉన్నారు. అదేసమయంలో వైసీపీ నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడింది. స్థానిక ఎమ్మెల్యేగానే కాక, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ముందుకుసాగిన ఏలూరి తనదైన పనితీరుతో టీడీపీ రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. వైసీపీ తరుపున గత ఎన్నికలలో ఓడిపోయిన వెంకటేశ్వరరావు ఏడాదికాలంలోనే తొలగించి రామనాథంబాబును, ఆతర్వాత ఆయన్నుతొలగించి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను, తాజాగా చీరాలకే చెందిన యడం బాలాజీని ఇన్‌చార్జిగా నియమించింది. ప్రస్తుతం ఎన్నికల సమయం ఆసన్నంకావడంతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. టీడీపీ, జనసేనతో కలిసి ముందడుగు వేస్తోంది. మండలాల వారీ రెండుపార్టీల నేతలు సమన్వయ సమావేశాలు నిర్వహించుకుని ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో పెద్దగా ప్రభావం లేకపోయినప్పటికీ బీజేపీ అభిమానులు, ఆర్ఎస్ఎస్ వాదులు టీడీపీతో కలిసేందుకు సిద్ధమయ్యారు.

టీడీపీలోకి వలసలు

టీడీపీ అభ్యర్థిగా తిరిగి ఏలూరి సాంబశివరావును అధిష్ఠానం ప్రకటించింది. నిత్యం నియోజకవర్గానికే అంకితమైన ఏలూరి ఎన్నికల సమరానికి సన్నద్ధమయ్యారు. దీంతో ఆపార్టీలోకి వలసలు పెరిగాయి. ప్రధానంగా కిందిస్థాయిలో ఓటు బ్యాంకులుగా గుర్తింపు పొందిన పలువురు నేతలు టీడీపీలో చేరిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్నారు. పలువురు తటస్థవాదులు, మరీ ముఖ్యంగా ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాల ప్రతినిధులు టీడీపీలో చేరుతున్నారు. పక్షం రోజులుగా జరుగుతున్న ఈ చేరికలను చూస్తే దళిత, బలహీన వర్గాలకు చెందిన ప్రతినిధులు, యువకులు ఎక్కువగా చేరడం కనిపించింది. మార్టూరు, ఇడుపులపాడు, వంకాయలపాడు, పెదగంజాం, పూనూరు, పర్చూరు ఇలా అనేక ప్రాంతాల్లోని దళిత, బలహీన వర్గాల ప్రాంతాల్లో పలుకుబడి ఉన్న కిందిస్థాయి నేతలు, యువకులు, అధికంగా టీడీపీలో చేరారు. మార్టూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, అలాగే కీలకమైన మోటుపల్లి గ్రామ సర్పంచ్, గన్నవరం, పూనూరు, నాగండ్ల, చెరుకూరు, గంగవరం, ఇడుపులపాడు తదితర అనేక గ్రామాల్లో వార్డు స్థాయిల్లో కీలకమైన నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో టీడీపీలో చేరికలు జరుగుతుండగా, ఆయావర్గాల మహిళలు, ప్రతినిధులు ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి కార్యాలయానికి వచ్చి మద్దతు పలుకుతున్నారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వ ప్రత్యేకించి నియోజకవర్గంలోని ఆ పార్టీ నేతల వేధింపులు, ప్రజావ్యతిరేక చర్యలతో ఇబ్బందిపడిన అన్ని రకాల వ్యాపారవర్గాల ప్రముఖులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏలూకి మద్దతు తెలుపుతున్నారు. గ్రానైట్ వ్యాపారులేకాక, ఎరువుల వ్యాపారులు, కోల్డ్ స్టోరేజీ నిర్వాహకు లు, విద్యా సంస్థల నిర్వాహకులు, రియల్టర్లు, వీరందరికీ మించి ఆయా రంగాలే జీవనాధారంగా ఉన్న ప్రజలు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు ప్రకటిస్తున్నారు.

హైదరాబాద్, బెంగళూరులో సమ్మేళనాలు

నియోజకవర్గం నుంచి ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పనుల రీత్యా హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు ఏలూరికి భారీగా మద్దతు ప్రకటిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, బెంగళూరులో జరిగిన నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనాలే నిదర్శనం. చిన్నపాటి సమాచారంతో ఆ రెండు నగరాల్లో ఉన్న పర్చూరు వాసులు, కుటుంబాలకు కుటుంబాలుగా వచ్చి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆ సమ్మేళనాలు పదులు, వందలు దాటి వేల సంఖ్యలో హాజరైన పర్చూరువాసులతో కిటకిటలాడాయి. టీడీపీకి, ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు పలుకుతున్న ఇతర ప్రాంతాల్లోని పర్చూరు వాసులు నియోజకవర్గంలోని వారి బంధువర్గానికి ఫోన్‌చేసి టీడీపీకి మద్దతు ఇవ్వాలని చెబుతూ ఏలూరి వద్దకు పంపుతుండడం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మొత్తం వాతావరణంలో టీడీపీలో జోష్ పెరిగింది.

కుదుటపడని వైసీపీ

అధికార వైసీపీలో నాలుగో కృష్ణుడిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన యడం బాలాజీ నియోజకవర్గంలో పరిస్థితిని చూసి బిత్తరపోతున్నట్టు సమాచారం. యద్దనపూడిలో ఆయన ఒక కార్యక్రమానికి వెళ్తే కీలక నేతలందరూ గైర్హాజరుకావడం ఆయనకు పెద్ద షాక్ ఇచ్చింది. అంతకుముందు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆమంచి కృష్ణమోహన్‌ను విభేదించిన వారంతా బాలాజీకి జై కొడతారన్న అధిష్ఠానం ఆశలు అడియాశలయ్యాయి. కిందిస్థాయిలో నేతలు ఆయన్ను కలిసేందుకు కూడా అవకాశం ఇవ్వలేదంటే అతిశయోక్తి కాదు. గత ఎన్నికలలో పోటీ చేసిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైసీపీకి వ్యతిరేకంగా మారారు. ఆతర్వాత ఇన్‌చార్జ్‌గా పనిచేసిన రామనాథంబాబు ఆ పార్టీలో ఉన్నా, బాలాజీకి మద్దతు ప్రకటించలేదు. ఇక ఆ మంచి ఒంటెద్దు పోకడలు, వేధింపులతో వ్యతిరేకంగా మారిన కీలక నేతల్లో పర్చూరు మండలంలో ఒకరుతప్ప మిగిలిన వారందరూ బాలాజీకి దూరంగానే ఉన్నారు. వ్యాపారరంగంలో ఉన్న వైసీపీ శ్రేణులంతా మీకు, మీప్రభుత్వానికి ఒక దండం అన్నట్టు పరోక్షంగా టీడీపీకి మద్దతు ప్రకటిస్తున్నారు.

ఈనేపథ్యంలో కీలకమైన గ్రానైట్ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వారి మద్దతు కోసం వైసీపీ ఇన్‌చార్జ్ బాలాజీ కొందరిని వెంటబెట్టుకుని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వరకు రాయబారం నడిపినా అటువైపు నుంచి ఏమాత్రం సానుకూలత లభించకపోవడం గమనార్హం.

సమస్త మానవాళి సంక్షేమమే రంజాన్ పవి త్ర దీక్షల పరమావధి

అద్దంకి, మార్చి 11: సమస్త మానవాళి సంక్షేమమే రంజాన్ మాస పవిత్ర దీక్షల పరమావధి కావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నెల రోజులపాటు నియమ నిష్టలతో కఠిన ఉపవాస వ్రతం ఆచరించే రంజాన్ మాసం మనిషిలోని చెడు భావాల్ని, అధర్మాన్ని , ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఉపవాస దీక్షలకు ఉపక్రమించిన ముస్లింలకు ఎమ్మెల్యే రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, దాన, ధార్మిక కార్యక్రమాలు విజయవంతం కావాలని రవికుమార్ పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయ కూరగాయలతో ఆరోగ్యం



మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద కూరగాయలను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బల్లికురవ, మార్చి 11: పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలను ప్రజలకు అందిస్తామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మండలంలోని పలుగ్రామాలలో ప్రకృతి వ్యసాయ పద్ధతి ద్వారా కూరగాయలను పండించిన వారు సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద తక్కువ ధరకు పోషకాలు కలిగిన కూరగాయలను విక్రయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతి ద్వారా సాగుచేసిన పంటలను ఆహారంలో తీసుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. ఇంటి పెరటిలో కూరగాయల సాగు చేసుకోనేలా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో కూరగాయల అమ్మకాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అభ్యర్థుల విజయం కోసం కృషిచేయాలి

చినగంజాం, మార్చి 11: గ్రామ స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, జనసేన మండల అధ్యక్షుడు సంద శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఈసందర్భంగా వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జనసేన, టీడీపీ, బీజేపీల చారిత్రక పొత్తు ఏర్పడిందని అన్నారు. ఉమ్మడి కార్యచరణ ప్రణాళికపై ఇరు పార్టీల నాయకులు చర్చించారు. తదనంతరం బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను టీడీపీ, జనసేన నాయకులు ఆవిష్కరించారు.

కార్యక్రమంలో నక్కల వెంకటనారాయణ, టి.జయరావు, యార్లగడ్డ లక్ష్మి, సంద శ్రీనివాసరావు, ఎస్వీ రాఘవులు, ఎస్.శ్రీనివాసరావు, వడ్లమూడి సాంబశివరావు, షేక్ సలాం, వి.సత్యనారాయణ, కట్టెబోయిన సుబ్బారావు, అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, కె.వాసుదేవరావు, టి.సతీష్‌కుమార్, కె.రామాంజనేయులు, జి.నరసింహారావు, ఉదయభాస్కర్‌రెడ్డి, కె.రాములు, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో పోలీసుల కవాతు

అద్దంకి, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామనే భరోసా ప్రజలకు కల్పించేందుకు పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర బలగాలతో అద్దంకిలో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన కవాతు ఆర్టీసీ బస్టాండ్, భవాని సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, నర్రావారిపాలెం, రామ్‌నగర్, బంగ్లా రోడ్డు మీదుగా సాగింది. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, పోలీస్, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ షంషుద్దీన్

పర్చూరు, మార్చి 11: సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో అహంకార, నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని టీడీపీ, జనసేన నేతలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పర్చూరు మండల స్థాయి శ్రేణులతో ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మానం హరిబాబు, షేక్ జమాలుద్దీన్, దూళిపల్లి వెంకటస్వామి, కంచేటి శ్రీహరి, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొరిటాల సురేష్, జనసేన నాయకులు కారంపూడి సందీప్ తేజ, విన్నకోట అజేయ్, తులసి చంటి, ఆకుల వెంకటేశ్వరరావు, కొల్లా శివరాంప్రసాద్, తంగెళ్ళ మల్లికార్జునరావు, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, బత్తుల సాంబశివరావు, మల్లాది సురేష్, దాసరి రామకృష్ణ, షేక్ గౌస్, షేక్ బషీర్, పఠాన్ సమీర్, గోరంట్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఛైర్మన్‌గా వెంకటశివప్రసాద్

పర్చూరు, మార్చి 11: పర్చూరులో వేంచేసియున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమణస్వీకారం సోమవారం స్థానిక ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఛైర్మన్‌గా నియమితులైన రావువారి వెంకటప్రసాద్ తోపాటు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కొరిశపాడు శివాలయంలో చోరీ

మేదరమెట్ల , మార్చి 11: కొరిశపాడు శివాలయంలో తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి శివాలయానికి ఉన్న తలుపుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సుమారు 5 కేజీల వెండి, 2 సవర్ల బంగారం, రూ.80 వేల నగదు అపహరించినట్టు ఆలయ పూజారి శేషగిరి తలిపారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి కల్యాణం అనంతరం అన్నదానాకి దాతలు ఇచ్చిన నగదు, గ్రామోత్సవంలో ఇచ్చిన కానుకలు కలిసి సుమారు రూ.80 వేలు ఆలయంలో ఉంచినట్లు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణారెడ్డి కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రజావిశ్వాసంలేకే 'సిద్ధం' వెలవెల

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సంతమాగులూరు, మార్చి 11: ప్రజావిశ్వాసం లేక మేదరమెట్ల వద్ద జరిగిన సిద్ధం సభ వెలవెలబోయిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పుట్టావారిపాలెం అతిథి గృహంలో కుందుర్రు, మామిళ్ళపల్లి, పరిటాలవారిపాలెం, అడవిపాలెం, కామేపల్లి, మక్కెనవారిపాలెం గ్రామాల టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలకోట్ల ప్రజల ఆస్తులను కొల్లగొట్టి అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మేదరమెట్ల వద్ద జరిగిన సభలో జగన్ అబద్ధాల విషపు జల్లు కురిపించారని ధ్వజమెత్తారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా వైసీపీ నేతలు ఫాం-7 దరఖాస్తులు పెడుతూ కుట్రలకు తెరలేపారని అన్నారు. నాసిరకం మద్యంలో జగన్ లక్ష కోట్లు కమీషన్ కొట్టేశారని అన్నారు. అందులో భాగంగానే డిజిటల్ పేమెంట్స్ లేకుండా చేశారని పేర్కొన్నారు. జగన్ పాలనలో అన్నివర్గాలు నష్టపోయాయని అన్నారు.

కాగా సంతమాగులూరు మండలం కొప్పరం ఉత్తరబజారుకు చెందిన వడియరాజులు 60 కుటుంబాలు, మాజీ ఎంపీటీసీ షేక్ బోడా ఆధ్వర్యంలో 50 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో దూపాటి ఏసోబు, అట్లా చినవెంకటరెడ్డి, చేవూరు వాసిరెడ్డి, తేలప్రోలు రమేష్, గాడిపర్తి వెంకట్రావు, గురు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ

- ప్రభుత్వం దృష్టికి సమస్యలు
- ఫ్యాక్టరీ యజమానుల నిర్ణయం



వేమవరం వద్ద సమావేశమైన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు

బల్లికురవ, మార్చి 11: గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని యజమానులు పేర్కొన్నారు. గ్రానైట్ పరిశ్రమల నిర్వహణలో నెలకొన్న సమస్యలను మరోమారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఫ్యాక్టరీల యజమానులు నిర్ణయించుకొన్నారు. సోమవారం బల్లికురవ మండలంలోని 125 గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు వేమవరం వద్ద సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలు రోజురోజుకు మూతపడుతున్నాయని అన్నారు. విద్యుత్ బిల్లులతో పాటు అధికారుల దాడులు కూడా పెరిగాయని అన్నారు. దీంతో పరిశ్రమలను నడపాలంటే భయం వేస్తుందని చెప్పారు. భూసర్వే హద్దురాళ్లు కూడా పెద్దఎత్తున ఫ్యాక్టరీలలో నిల్వ ఉన్నాయని అన్నారు. ఇలా అయితే ఫ్యాక్టరీల నిర్వహణ కష్టమని కొందరు యజమానులు భావించి మూసి వేయాలని అనుకొన్నారని తెలిపారు. అలా అయితే మరింత నష్టం వస్తుందని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళదామని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అప్పుడు కూడా తమ మొర ఆలకించకపోతే అప్పుడే ఫ్యాక్టరీలు మూసివేద్దామని ఈసందర్భంగా పలువురు యజమానులు తమ నిర్ణయాన్ని తెలియపరిచారు. మరో రెండురోజుల్లో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులందరూ సమిష్టిగా అధికారులను, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని కలవాలని నిర్ణయించారు. అప్పటివరకు ఫ్యాక్టరీలను యధావిధిగా నడుపుతామని ఈసందర్భంగా పలువురు తెలిపారు. సమావేశంలో ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు.

మార్టూరులో మూతపడిన గ్రానైట్ పరిశ్రమలు

మార్టూరు, మార్చి 11: మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమలు సోమవారం మూతపడ్డాయి. గ్రానైట్ పరిశ్రమల యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు గ్రానైట్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయానికి అనుకూలంగా పరిశ్రమలను మూసివేశారు. ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, ప్రస్తుతం పరిశ్రమలను మూతవేయడం ద్వారా మరింతగా సంక్షోభం వైపు పయనిస్తున్నామని తెలిసినా తప్పనిసరి పరిస్థితులలో మూసివేయాలని నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని పరిశ్రమల యజమానులు అంటున్నారు.

ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల అమలుకు మీనమేషాలు

- తప్పుచేసిన వాళ్లను గుర్తించకుండా, ఏమి తెలియని వారికి శిక్షా!
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు




నియోకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునిల్‌కుమార్ కు వినతి పత్రం అందజేస్తున్న స్వీయఫాం -7 బాధితులు, టీడీపీ నేతలు

అద్దంకి, మార్చి 11: తప్పుడు స్వీయ ఫాం-7లు అప్‌లోడ్ చేసిన వ్యక్తులను గుర్తించకుండా, ఏమి తెలియని ఓటర్లను ఆగమేఘాల మీద గంటల వ్యవధిలోనే హాజరు కావాలని బీఎల్‌వోలు చెప్పటం పట్ల పలువురు బాధితులు, టీడీపీ నేతలు సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, పలువురు బాధిత ఓటర్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారితో మాట్లాడారు. గత నెలలో ఇతర జిల్లా ఓటర్లు అద్దంకి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లుగా నమోదు కావటంపై అన్ని ఆధారాలతో స్థానికంగా ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. విచారణ జరిపి మూడు రోజులలో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల అధికారి గతనెల 29న ఉత్తర్వులు ఇచ్చినా ఇంతవరకు నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేయటంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న ఓటర్ల పేరుతో ఎవరో దరఖాస్తు చేసిన స్వీయ ఫాం-7ల విషయంలో మాత్రం ఆగమేఘాల మీద విచారణ చేపట్టం ఏమిటన్నారు. నిబంధనల మేరకు ముందస్తుగా నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, వాటన్నింటిని పక్కనపెట్టి సోమవారం ఉదయం ఫోన్ చేసి మధ్యాహ్నం ఒంటి గంటలోపు హాజరై సమాధానం ఇవ్వాలని బీఎల్‌వోలు ఫోన్ చేయటాన్ని నియోజకవర్గ ఎన్నికల అధికారి దృష్టికి తీసుకుపోయారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకు పోవటంతో పాటు కోర్టును కూడా ఆశ్రయిస్తామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.

బల్లికురవ మండలం అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, అద్దంకి మండలం ధేనువకొండకు చెందిన పలువురు స్వీయ ఫాం-7 బాధితులు సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. తమ ఓట్లు తొలగించమని తప్పుడు ఫిర్యాదులు చేసిన వ్యక్తులను గుర్తించి శిక్షించాలని కోరారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, మానం మురళీమోహన్‌దాస్, చిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తమకు తెలియకుండా తమ పేర్లతో తప్పుడు స్వీయ ఫాం- 7 దాఖలు చేసిన వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి అర్జీలు ఇచ్చేందుకు పలువురు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

ప్రజాదరణ కోల్పోయిన జగన్

- సిద్ధం సభలో చూపించిన జనమంతా గ్రాఫిక్స్
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, మార్చి 11: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ అంతా గ్రాఫిక్స్ అని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జగన్‌ను సాగనంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈమేరకు సోమవారం ఆయన ఓప్రకటన విడుదలచేశారు. జగన్ మళ్ళీ అధికారంలోకి రావాలని అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుతంత్రాలు చేసినా జనం సభలకు రావటంలేదని, గత్యంతరం లేక గ్రాఫిక్స్‌ను నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. సిద్ధం సభకు మీడియాకు అనుమతి లేదంటూ పోలీసు అధికారులతో నోటీసులు ఇప్పించారని, దీనికి ప్రధాన కారణం గ్రాఫిక్స్ బాగోతం బయట పడుతుందని రానివ్వలేదన్నారు. సిద్ధం సభల పేరిట సామాన్యులపై యుద్ధం ప్రకటించారని, సభకు రాకపోతే ప్రభుత్వ పథకాలు తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయటం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అమలు కానీ హామీలు ఇచ్చి, నేడు వాటిని నిలబెట్టుకున్నానని జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. 85శాతం హామీలను అమలుచేయకుండా మాటతప్పి మడమ తిప్పారని విమర్శించారు. సంక్షేమానికి బడ్జెట్‌లో జగన్ 15శాతం ఖర్చు చేయగా, చంద్రబాబు 19 శాతం ఖర్చుచేశారని వివరించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దుచేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి అని చెప్పి ఒక్కబిడ్డతో సరిపెట్టి అందులోనూ కోతవేశారన్నారు. రైతు భరోసాకు రూ.12500 హామీపై మాట తప్పారన్నారు. రాష్ట్ర నిధుల నుంచి కేవలం రూ.7500 మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కేంద్రం ఇచ్చే రూ.6వేలను తానే ఇచ్చినట్లు అబద్ధాలు ఆడుతూ ప్రచారం చేసుకోవడం రైతులను దగా చేయటం కాదా అని ఏలూరి ప్రశ్నించారు. 25 లక్షలు పక్కాఇళ్ళు ఉచితంగా ఇస్తానని చెప్పి పేదలను అప్పులపాలు చేసి సెంటు పట్టాపేరుతో రూ.7వేల కోట్లు కుంభకోణం చేశారన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలకు కేంద్రం పంపిన రూ.12వేల కోట్లు నిధులను జగన్ దారి మళ్ళించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని అన్నారు. ప్రజలను మోసం చేయటానికి, మాయ చేయటానికి మేదరమెట్లకు ఆరు జిల్లాలలోని 50 నియోజకవర్గాల నుంచి ఆర్టీసీ, ప్రయివేట్ బస్సులలో రూ.వంద కోట్లు ఖర్చుచేసి జనాన్ని తరలించే ప్రయత్న చేశారని, అయినా సభ వెలవెల బోయిందన్నారు. అందుకే మీడియాపై ఆంక్షలు పెట్టారని ఏలూరి పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

బల్లికురవ, మార్చి 11: తమకు రావాల్సిన జీతాల బిల్లు బడ్జెట్‌ను ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి ఇంతవరకు జీతాల బిల్లు కూడా పెట్టలేదని అన్నారు. దీంతో తమ కుటుంబాలు గడవటం చాలా కష్టంగా ఉందన్నారు. పనిచేసిన కాలానికి ప్రతినెలా ఒకటో తేదిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నేతలు పెయ్యల రంగనాథ్, అంకమ్మరావు, నాగేశ్వరరావు, కొమ్మతోటి గోపి, ఆశోక్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకిటౌన్, మార్చి 11: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో ఏ. కృష్ణకుమారి అన్నారు. సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అద్దంకి-ఏ సెక్టార్‌లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే వైఎస్ఆర్ కిట్లు ఉపయోగించు కోవాలన్నారు. రాగులు, సజ్జలు, జొన్నలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు వల్ల కలిగే ఉపయోగాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వేటపాలెం(చీరాలటౌన్), మార్చి 11: పోషకాహారంతో గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఏసీడీపీవో సుచిత్ర పేర్కొన్నారు. సోమవారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట సెక్టార్ జీవరక్ష నగర్ ఆరోగ్య కేంద్రంలో ఘనంగా పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాలింతలకు రాగి జావ, జొన్న. సజ్జ పిండులతో అల్పాహారం తయారీవిధానాన్ని వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

22న దేవస్థానంలో విగ్రహాల ప్రతిష్ఠ

మార్టూరు, మార్చి 11: మార్టూరులోని గన్నవరం రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 22న నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకాపరమేశ్వరి, విఘ్నేశ్వరుడు, గోపుర కలశం, మహావతార్ బాబాజీ విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఈనెల 20 నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 22వతేదీ మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

మార్టూరు, మార్చి 11: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ అన్నారు. సోమవారం మార్టూరులో ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. రసాయన పురుగుమందులను వినియోగించి పండించిన పంటల ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చిన్నయ్య, అడిషనల్ డీపీఎం మోహన్, రాజారత్నం, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, అప్పారావు, భారతి, ప్రకాష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ ఆలయ జీర్ణోద్ధరణ పనులకు శంకుస్థాపన

ఇంకొల్లు, మార్చి 11: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో శ్రీభూనీలా సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రముఖ వేద పండితులు నారాయణం రమణదీక్షితులు, నారాయణం శశిధర్‌లు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. పలువురు ముత్తయిదువులు పూజా కార్యక్రమంలో పాల్గొని జలబిందెలతో శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు నారాణం శ్రీనివాసాచార్యులు, సత్తిబాబుతో పాటు పలువురు గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

పర్చూరు, మార్చి 11: పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం రోటరీ అధ్వర్యంలో పరీక్షా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని అన్నంబొట్లవారిపాలెం, ఉప్పుటూరు, అడుసుమల్లి హైస్కూల్ విద్యార్థులకు రోటేరియన్ నర్రా వెంకట్, లక్ష్మీసుధ దంపతుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన పరీక్షా సామగ్రిని రోటరీ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పంబి సదానందరెడ్డి, కోమటి అంజనేయులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం


మార్టూరు, మార్చి 11: మార్టూరులోని గన్నవరం రోడ్డులోగల కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం విచ్చేశారు. ఈసందర్భంగా మార్టూరు మండల పార్టీ అధ్యక్షుడిగా షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శిగా అంజిరెడ్డిని నియమించారు. కార్యక్రమంలో పేరం ప్రభాకర్, తోట శివ, పఠాన్ రాజేష్, అంబేడ్కర్, పోతిన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపాలి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 11: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి తెలుగుదేశం పార్టీ, జనసేన కార్యకర్తలు కలిసి పనిచేయాలని ఇరు పార్టీల నాయకులు తీర్మానించారు. సోమవారం రాత్రి యద్దనపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రెండు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. సమావేశంలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని చర్చించుకున్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారకరామారావు, రావిపాటి సీతయ్య, జనసేన నాయకులు అయ్యప్ప, మధు, సూరవరపు పల్లి, తదితరులు పాల్గొన్నారు.

'సమన్వయంతో కలిసి పనిచేద్దాం'

ఇంకొల్లు, మార్చి 11: వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఏలూరి సాంబశివరావు గెలుపునకు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఇరుపార్టీల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో కలిసి పనిచేసేందుకు సంయుక్త కార్యాచరణ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వలేరు మార్క్, జనసేన మండల అధ్యక్షుడు నారిశెట్టి ప్రవీణ్, డాక్టర్ శ్యాంసుందర్, పాలేరు రామకృష్ణ, గుంజి వెంకట్రావు, వీరగంధం ఆంజనేయులు, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.



సోమశిలలో 13.650 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 11: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి జలాశయంలో 13.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.



పరీక్షల వేళ..
ఆరోగ్యం పదిలం !

ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలవుతుంది. తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడం కోసం దృష్టి కేంద్రీకరించే విద్యార్థులు ఆహారం తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో చదువుపై ఆసక్తి తగ్గిపోయి లక్ష్యం నీరుగారిపోతుంది. విద్యార్థుల చదువుతోపాటు తీసుకునే ఆహారంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో పది విద్యార్థుల కోసం అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు (విద్య)

ఆహారం, నిద్ర ముఖ్యం...




పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు. చదివిన అంశాలు గుర్తుండాలంటే నిద్రకు ఏడు లేదా ఎనిమిది గంటల సమయం కేటాయించాలి. విద్యార్థులు ఇడ్లీ, పెరుగన్నం, అరటి పండ్లు, క్యారెట్, పాలు ఎక్కువగా తీసుకుంటే మంచిది. నీళ్ల ఎక్కువగా తీసుకోవాలి. పరీక్షలకు ముందు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ గంగాధర్, ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్

మంచి మార్కులు సాధించే క్రమంలో తమ చిన్నారులు తిండిపై కూడా ధ్యాసలేకపోవడంతో ఫలితాలపై ఆ ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పదోతరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 30వేల మంది పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు తెలియని భయానికి గురై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారంపై శ్రద్ధ, సరైన నిద్రలేక ఏకాగ్రత కోల్పోతుంటారు. ఈ క్రమంలో ఒత్తిడికి గురికాకుండా సమయానికి సాత్విక ఆహారం తీసుకుంటూ బాగా నిద్రపోతే జ్ఞాపకశక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటిస్తే మరింత ఉత్సాహాన్ని సొంతం చేసుకోవచ్చని వారు అభిప్రాయ పడుతున్నారు.

● సమస్యలకు చెక్...

ఒత్తిడి సమస్యతో బాధపడే విద్యార్థులు ముందు ప్రశాంతంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షలు రాయడమే తప్ప పాస్, ఫెయిల్ గురించి ఆలోచించవద్దంటున్నారు.మార్కుల గురించి పట్టించుకోవద్దని, వచ్చిన అంశాలను పేపర్‌పై ప్రజెంట్ చేయడంపైనే దృష్టి సారించాలంటున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో కొత్త అంశాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపించవద్దని, ఇప్పటికే చదివిన పాఠ్యాంశాలనే పునరుశ్చరణ చేసుకోవాలని చెబుతున్నారు. పిల్లలు ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని, మార్కులు, టార్గెట్‌లు అసలు పెట్టవద్దని సూచిస్తున్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగా, మెడిటేషన్ చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని తెలియ చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లకు అలవాటుపడిన విద్యార్థులు పరీక్షలు పూర్తయ్యే వరకు వాటి జోలికి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.



● ఆహారం ఇలా...

● చదివేటప్పుడు విద్యార్థులు ఒత్తిడికి గురికావడంతో కడపులో మంట వస్తుంది. రాత్రిపూట ప్రతిరోజూ పెరుగన్నం తీసుకుంటే బాగుంటుంది.

● పచ్చి క్యారెట్‌ను నియమితంగా తినడం వల్ల విటమిన్-ఏ లభిస్తుంది. పుస్తకాలు చదివే సమయంలో కళ్ల మంటలు పుడుతుంటాయి. దీని నుంచి విద్యార్థులు బయటపడాలంటే క్యారెట్‌ను తీసుకోవాలి.

● ఉదయం ఇడ్లీ తినడం వల్ల విద్యార్థులకు కార్బోహైడ్రేట్స్ లభిస్తాయి. అది జీర్ణం కావడం వల్ల గ్లూకోజ్‌గా మారి శక్తి లభిస్తుంది.

● అరటిపండ్లు తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

● విద్యార్థులు ఒత్తిడికి గురికావడంతో చెమటలు పడతాయి. ఇలాంటి విద్యార్థులు నీటిని ఎక్కువగా తాగాలి.

● పరీక్షల సమయంలో కొవ్వు పదార్థాలు, నూనె వస్తువులు, మాంసాహారాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలి.

● తీసుకునే ఆహారం పరిమాణం తగ్గించాలి. నిద్రపోయే ముందు పాలు తాగాలి.

● పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి యోగా చేయాలి.

● జామ, అరటి, ఆపిల్ వంటి పండ్లను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ బాగుంటుంది. ఆరోగ్యపరంగా అవి విద్యార్థికి ఎంతగానో ఉపయోగపడతాయి.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.28
సహారి (బుధవారం) : 4.53



విద్యుత్ దీపాల వెలుగులో నెల్లూరు కోటమిట్ట మసీదు

● నెలవంక కనిపించడంతో ముస్లింల సంబరాలు



నెల్లూరు (సాంస్కృతికం): రంజాన్ మాసం ప్రారంభ సూచికంగా సోమవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించింది. దీంతో జిల్లావ్యాప్తంగా ముస్లింలు సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. మరికొందరు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. రాత్రి అన్ని మసీదుల్లో అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ప్రత్యేక దువా చేశారు. మంగళవారం తెల్లవారుజామున సహరీతో రంజాన్ ఉపవాస దీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు.

వేసవి అలవెన్సులు ఏవి ?

● వేతనాలూ ఆలస్యమే..! ● ఉపాధి హామీ పనులపై కూలీల నిరాసక్తి

● రోజురోజుకూ నీరుగారుతున్న పథకం

సంగం, మార్చి 11 : గ్రామాల్లో వలసలు నివారించి, పేదలకు ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజురోజుకూ నీరుగారుతోంది. గతంలో పనికి వెళ్తే వేతనాలు వెంటనే పడేవి. ప్రస్తుతం పనిచేసిన ఐదారు వారాలకు కూడా వేతనాలు పడడంలేదు. అంతేకాక పనికి తగ్గ కూలి రాకపోవడంతో ఉపాధి హామీ పనులపై కూలీలు ఆసక్తి కనపరచడం లేదు. ఎండాకాలం వచ్చిందంటే వేసవిభత్యం కింద 20 శాతం నుంచి 30 శాతం అదనంగా ఇచ్చేవారు. వేసవిలో నేల గట్టిగా ఉంటుంది. పనిజరగదు. ఎక్కువ సమయం పనిచేయలేరు. దీంతో కూలి గిట్టుబాటు అయ్యేది కాదు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరిలో 20 శాతం మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 అదనంగా కూలి ఇచ్చేవారు. దీంతో పని తక్కువగా జరిగినా కూలి గిట్టుబాటు అయ్యేది. రెండేళ్ల వరకు ఈ విధానం ఉండేది. కానీ ప్రస్తుతం వేసవి అలవెన్సు నిలిపివేశారు. కూలి రూ. 270లకు పెంచినా వేసవిలో ఆ మేరకు గిట్టుబాటు కావడం లేదని కూలీలు అంటున్నారు.

● ఇతర అలవెన్సులకు మంగళం

గతంలో పరికరాలకు అలవెన్సుల కింద అదనంగా సొమ్ములు ఇచ్చేవారు. గడ్డపారకు రూ. 10, మంచినీటికి రూ.5 వేసవి అలవెన్సులుగా ఉండేవి. రెండేళ్లుగా అవి కూడా రావడం లేదని కూలీలు అంటున్నారు. కనీసం పనిచేసే సమయంలో ఏ చిన్న గాయమైనా ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి కిట్లు ఇచ్చేవారని, అవి కూడా ఇప్పుడు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో టెంట్‌లు ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ పంపిణీ కూడా లేదంటున్నారు. ఉదయం. 7 నుంచి మధ్యాహ్నం 11-00 గంటల వరకు మండుటెండలో పనిచేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలవెన్సులు సరిగా రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవిలో అలవెన్సులతోపాటు పరికరాలు, పని చేసేచోట తాగునీటి, నీడకు టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు వంటి సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎన్నికలకు యంత్రాంగం
సిద్ధం !

● ఏర్పాట్లన్నీ పూర్తి... నోటిఫికేషనే తరువాయి
● కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక
● జిల్లాకు చేరుకున్న కేంద్ర బలగాలు
● ఈవారంలో ఈసీ ప్రకటన వస్తుందని అంచనా

నెల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. పోలింగ్ కేంద్రాల నుంచి సిబ్బంది వరకు అంతా సిద్ధమయ్యారు. జిల్లాలోని పరిస్థితులపై ఉన్నతాధికారులు ఎన్నికల కమిషన్‌కు నివేదికను అందజేశారు. ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడమే మిగిలింది. ఈ వారంలోనే ఈసీ ప్రకటన వెలువడుతుందని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగానే కేంద్ర భద్రతా బలగాలు కూడా జిల్లాకు చేరుకున్నాయి.

● 2,317 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

సార్వత్రిక ఎన్నికలు - 2024కు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,317 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అత్యధికంగా కోవూరు నియోజకవర్గంలో 324, ఉదయగిరిలో 323 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ కేంద్రాల్లో పోలింగ్‌కు అనువుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణం, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడం, వెబ్‌కాస్టింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు. గతంలో వివాదాలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఈ కేంద్రాల్లో పరిస్థితులను బట్టి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. ఇప్పటికే ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి కాగా, పోలింగ్ సిబ్బందికి కూడా పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. వివిధ స్థాయిల ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చారు. కొంత మంది సిబ్బందిని రిజర్వులో ఉంచారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఈ సిబ్బంది వారికి కేటాయించిన విధులు చేపట్టేలా ఆదేశాలిచ్చారు. ఉన్నతాధికారులు నిరంతరం ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందితో సమీక్షిస్తున్నారు..



వీకర్ సెక్షన్ ఉన్న కాలనీలకు సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలు, పోలీసు సిబ్బందిని పంపి ఓటర్ల సమస్యలు తెలుసుకుంటు న్నారు. ఓటు వేయడానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అన్న వివరాలను తెలుసుకొని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళుతున్నారు.

● జిల్లాకు కేంద్ర బలగాలు

2019 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కూడా గతంలో మార్చి 10న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ దఫా కూడా నోటిఫికేషన్‌ను ఈవారంలోనే ప్రకటిస్తారని అంచనా వేస్తున్నారు. ఈనెల 15వ తేదీలోపు ఇద్దరు కేంద్ర ఎన్నికల కమిషనర్లను నియమించేందుకు ప్రధాని నేతృత్వంలోని కమిటీ రాష్ట్రపతికి సిఫార్సు చేయనుంది. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత ఎన్నికల మాదిరిగానే ఈ దఫా కూడా మొదటి విడతలోనే రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. కేంద్ర భద్రతా బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) సిబ్బంది 200 మంది ఇప్పటికే జిల్లాలో రిపోర్ట్ చేసుకున్నారు. మరికొంతమంది కూడా త్వరలోనే వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్‌లో ఏజెంట్లను నియమించుకున్నాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ 2,263 మందిని, వైసీపీ 2,225 మంది బీఎల్‌ఏలను నియమించుకున్నాయి. ఆ వివరాలను కూడా జిల్లా అధికా రులు ఎన్నికల కమిషన్‌కు పంపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 19,13,549 మంది ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నోటిఫికేషన్ వచ్చే వరకు కొత్త ఓట్లను చేర్చడంతో పాటు అభ్యంత రాలు కూడా స్వీకరించనున్నారు.



నెల్లూరులోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లినేని వెంకటరామారావు

పదవులు కాదు..
పార్టీ ముఖ్యం !

● అధినేత ఆదేశానుసారం నడుచుకుంటా..
● ఉదయగిరిలో టీడీపీ విజయానికి కృషిచేస్తా..
● ముఖ్యనేతల సమావేశంలో బొల్లినేని

నెల్లూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): తనకు పదవులు ముఖ్యం కాదని, టీడీపీయే ముఖ్యమని, అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఉదయగిరిలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఉదయ గిరి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. వారినుద్దేశించి రామారావు మాట్లాడుతూ ఉదయగిరి టికెట్ విషయంలో తనకు మాటమాత్రమైనా చెప్పలేదనే బాధతో కొద్ది రోజులు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నానని, అయితే ఏ కారణాలతో ఉదయగిరి టికెట్ ప్రకటించాల్సి వచ్చిందో ఆదివారం పార్టీ అధినేత వివరిం చడంతో ఆ బాధ తొలగిపోయిందన్నారు. తన మీద అభి మానంతో నియోజకవర్గ నాయకులంతా సమావేశానికి హాజరు కావడం సంతోషమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, మన పిల్లల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరం అని ప్రజలు ఇప్పటికే గుర్తిం చారని, వారిని మరింత చైతన్యపరిచి ఓటింగ్ వరకు తీసుకొచ్చే బాధ్యతను గ్రామ, మండల స్థాయి నాయకులు తీసుకోవాలని బొల్లినేని కోరారు. తనకు టికెట్ రాలేదనే ఆవేదనతో ఎవరూ ఎన్నికలకు దూరంగా ఉండ వద్దని, అందరం కలిసి ఉదయగిరిలో టీడీపీని గెలిపించుకుని చంద్ర బాబుకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందామని ఆయన నేతలను కోరారు. ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందింది టీడీపీ పాలనలోనే అనే విషయాన్ని ప్రజలకు మరోసారి గుర్తు చేయాల న్నారు. నియోజకవర్గానికి జాతీయ రహదారులు తీసుకొచ్చామని, రోడ్లు, వంతెనలు, చెక్‌డ్యాంలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ విషయా లను ప్రజలకు గుర్తు చేసి టీడీపీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. సమావేశం అనంతరం మండల వారీగా నాయకులతో రామారావు వేర్వేరుగా సమావేశమై ఎన్నికల వ్యూహంపై చర్చించారు.

బొల్లినేనికి ఘన సన్మానం

బొల్లినేని వెంకట రామారావును టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. గజమాలతో, పూల బొకేలతో ముంచెత్తారు. ఆయనతో ఫొటోలు దిగడానికి పలువురు ఎగబడ్డారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకుడు పీ చెంచల్‌బాబు యాదవ్‌తోపాటు ఎనిమిది మండలాలకు చెందిన టీడీపీ ముఖ్యనాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల నిర్వహణపై చర్చించుకున్నారు.

శిథిలావస్థలో సోమశిల నీటి పథకం

పట్టించుకోని అధికార యంత్రాంగం

అనంతసాగరం, మార్చి 11: ప్రజల దాహార్తి తీర్చేందుకు సోమశిలలో నిర్మించిన తాగునీటి పథకం మరమ్మతుకు గురై నిర్వాహణ లోపంతో శిథిలావస్థకు చేరుకుంది. స్థానిక అతిథిగృహం వద్ద పెన్నానదిలో సంప్ నిర్మించి అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా అనంతసాగరం మండలంలోని 13 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా సుమారు రూ. 7కోట్ల అంచనాతో 2011లో విని యోగంలోకి వచ్చిన ఈ పథకం నిర్దేశిత గ్రామా ల్లో తాగునీటి ఎద్దడిని తీర్చింది. అయితే 2021లో సోమశిలకు వచ్చిన భారీ వరదలకు పెన్నానదిలో ఏర్పాటుచేసిన మోటార్లు కొట్టుకుపోవడంతో నీటిపథకం మూలనపడింది. ఆతర్వాత రూ. 39 లక్షలతో పనులు చేసి వినియోగంలోకి తేవాలని అధికారులు ప్రణాళిక చేశారు. అయితే ఆ దిశగా పనులు పూర్తిచేయలేదు. అధికార యంత్రాగం పట్టించుకోక పోవడంతో విలువైన సామగ్రి, మోటార్లు తుప్పుపడుతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు

సోమశిల నీటి పథకం ద్వారా కమ్మవారిపల్లి, పీకేపాడు, ఉప్పలపాడు, వరికుంటపాడు, ముసా పురం, పాతాళపల్లి, గోవిందమ్మపల్లి, అనంత సాగరం, సోమశిల గ్రామాలకు నీటి సరఫరా జరిగేది. మూడేళ్లుగా సీపీడబ్ల్యూఎస్ స్కీం విని యోగంలో లేని కారణంగా ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి బోర్లు, ప్రత్యేక పైప్‌లైన్లు వేసి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే అవి



శిథిలావస్థకు చేరిన నీటిపథకం

మరమ్మతులకు గురైతే నీటి ఇబ్బందులు తప్ప వని, ఇకనైనా సోమశిల నీటి పథకాన్ని విని యోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భీమేశ్వరుడి గ్రామోత్సవం



ఏకాంతసేవలో భీమేశ్వరస్వామి

సంగం, మార్చి 11: మండలంలోని వంగల్లులో జరుగు తున్న భీమేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి స్వామివారికి ఏకాంతసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిం చారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి.

పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

ఉదయగిరి రూరల్, మార్చి 11: త్వరలో జరగనున్న ఎస్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎం ఈవో-1 మస్తాన్‌వలి సూచించారు. సోమవారం స్థానిక యాదవపాళెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల పఠన, బోధన సామర్థ్యాలను పరిశీలిం చారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉదయగిరి, మార్చి 11: పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వినీత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నూర్జహాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 11: డీసీపల్లి పొగాకు బోర్డులో సోమవారం కనిష్ఠ, గరిష్ఠ ధరలు కేజీ రూ 230 పలికాయి. రైతులు బోర్డుకు 294 బేళ్లను తీసుకొని రాగా, 12 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 288 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 6 బేళ్లను తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

అనంతసాగరం, మార్చి 11: విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించవద్దని అనంతసాగరం ఎంపీడీవో తాజ్‌మాస్రూర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

పరమానందస్వామికి ప్రత్యేక పూజలు

కలువాయి, మార్చి 11: కలువాయి మండలం రాజుపాళెం సమీపంలోని ఆశ్రమ వ్యవస్థాపకుడు పరమా నందస్వామి 27వ ఆరాధన కార్యక్రమం సోమవారం జరిగింది. ఆశ్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ ప్రధాన అర్చకులు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు, మార్చి 11 : ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలను 9959225645 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

బిట్రగుంట ఎస్ఐకు ఉద్యోగోన్నతి

నెల్లూరు (విద్య), మార్చి 11 : బిట్రగుంట ఎస్ఐ కే శేఖర్‌బాబుకు సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. శేఖర్‌బాబు 2009లో పోలీస్‌శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరి జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం బిట్రగుంటలో పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి లభించడంతో విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సేవాసమితి కమిటీ సభ్యులు

ఆత్మకూరు, మార్చి 11: మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం, నరసాపురం, శాంతినగర్, వెంకట్రావు పల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణ య్య, గాయత్రి, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

సీతారామపురం, మార్చి 11: మండల పరిధిలోని చిన్నగంపల్లి, పబ్బులేటిపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన విజయ సంకల్ప యాత్ర జరు గుతుందని వైసిపి మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆత్మకూరు వైసీపీ నుంచి వలసల ప్రారంభం

● ఆనం సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక

సంగం, మార్చి 11: మండ లంలోని పలువురు వైసీపీ నా యకులు ఆనం రామనారాయ ణరెడ్డి సమక్షంలో సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి టీడీపీ లో చేరారు. మేకపాటి కుటుం బానికి సమీప బంధువు, మే కపాటి గౌతమ్‌రెడ్డికి అనుచరు డిగా ఉన్న మెట్టుకూరు వాసుదే వరెడ్డి, వాసుపల్లి శ్రీధర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, పెరమన గ్రామానికి చెందిన పిట్టు పట్టాభి రెడ్డి, ఆ గ్రామ ఉపసర్పంచ్ మాధవరెడ్డితో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వారివెంట వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.



ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

టీడీపీని గెలిపిస్తేనే భావితరాలకు భవిష్యత్తు

ఆత్మకూరు, మార్చి 11 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జన సేన, బిజెపి కూటమిని అత్యధిక మె జార్టీతో గెలిపిస్తేనే భావితరాల భవి ష్యత్ బాగుంటుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తె లుగు యువత నాయకుడు పి సా గర్ తెలిపారు. సోమవారం పట్ట ణంలో తెలుగు యువత ఆధ్వర్యంలో చంద్రబాబును గెలిపిద్దాం.. భావితరాల భవష్యత్‌కు బాటలు వేద్దాం అంటూ ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు మీ ఇంటి ముందుకు వచ్చి ఓటు అడిగితే ఏం అభివృద్ధి సాధించారో తెలపాలని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు తాటిపర్తి పెంచలయ్య, దండు ప్రవీణ్, గంటా నాగేంద్ర, మద్దినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ, యువత నాయకులు

బొల్లినేనికి పదవి పట్ల హర్షం

ఉదయగిరి రూరల్, మార్చి 11: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

జనసేన జెండా ఆవిష్కరణ

సీతారామపురం, మార్చి 11 : మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గునుకుల కిషోర్, ప్రకాశం జిల్లా సమన్వయకర్త రంతుల్లా, మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు,సురేంద్ర, అల్లూరి రవీంద్ర, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోగినేని కాశీరావు

హౌసింగ్ కాలనీలపై సమీక్ష

సీతారామపురం, మార్చి 11 : మండలంలో జరుగుతున్న హౌసింగ్ కాలనీల నిర్మాణాల పురోగతిపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్, హౌసింగ్ డిఇ ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్ మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్స్పెక్టర్ చెన్న రాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుమతి, బాలినేని ప్రవీన్, చిన్నయ్య, అంకయ్య, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం

ఉదయగిరి, మార్చి 11: పొదుపు మహిళల అభివృద్ధే ప్రధానమంత్రి మోదీ లక్ష్య మని ఏపీఎం ఖాజారంతు ల్లా అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానమంత్రి లక్‌పతి దీ వెన పథకం బ్రోచర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా పొదుపు మహిళలు కుటుంబ ఖర్చులు పోను రూ.10 వేలు ఆదాయం మిగిలే విధంగా ప్రణాళికలు తయారుచేసి రాబోవు రెండేళ్లల్లో లక్షాధికారు లుగా చేయడమే లక్ష్యమన్నారు. మండలంలో ప్రతి పంచాయతీలో 70 మంది మహిళలను మొదటి విడతగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రత్నకుమారి, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, చిట్టిబాబు, పొదుపు మహిళలు, వీవోఏలు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

స.హ చట్టం నోటీసుల జారీ

వరికుంటపాడు, మార్చి 11: సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న తనకు సకాలంలో సమాచారం అందచేయక పోవడంతో జిల్లా కలెక్టరేట్‌కు రాష్ట్ర కార్యాలయం నుంచి నోటీసులు అందినట్లు వరికుంటపాడుకు చెందిన నల్లగొర్ల మాల్యాద్రి తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 204లోని 4 ఎకరాల విస్తీర్ణంకు సంబంధించి లీగల్ సర్వీసు ఆథారిటికి పంపిన నివేదికలను అందజేయాలని కోరుతూ 2022 సెప్టెంబరు 5న కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ తనకు సమాచారం అందకపోవడంతో అదే ఏడాది అక్టోబరు 7న ప్రథమ అప్పీలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన తాను సమాచార హక్కు చట్టం కమిషన్‌ను ఆశ్రయించడం జరిగిందన్నారు. దీంతో ఈ నెల 18న నేరుగా గానీ లేదా ఆన్‌లైన్ ద్వారా గానీ విచారణకు హాజరు కావాలని సూచిస్తూ కలెక్టరేట్‌తో పాటు తనకు కూడా నోటీసులు అందజేయడం జరిగిందన్నారు.

న్యాయం కోసం గిరిజనుల ధర్నా

ఉదయగిరి, మార్చి 11: న్యాయం చేయాలని కోరుతూ మండ లంలోని తిరుమలాపురం ఎస్టీ కాలనీ వాసులు సోమవారం స్థానిక తహ సీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 68, 69, 70లలో 3.05 ఎకరాల భూమి తమ కు ప్రభుత్వం పట్టా ఇచ్చిందన్నారు. కాగా, అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడుతూ గుడిసెల వద్ద చదును చేసి రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అవసరమైన వారు తమ వద్ద స్థలం కొనుగోలు చేసుకోవాలని అంటూ ఇటీవల కొంతమంది ఒక్కో ప్లాట్‌కు రూ.35 నుంచి రూ.50 వేల వరకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నారని వివరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న గిరిజనులు

కార్మికులకు వారాంతపు సెలవులివ్వాలి

నెల్లూరు (వైద్యం), మార్చి 11 : జిల్లాలోని కొండాపురం మండలం చింతలదేవిలోని నేషనల్ కామధేను బ్రీడింగ్ కేంద్రంలో పని చేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కొండయ్య, నాగేశ్వరరావు, రవితేజ, గిరి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సుప్రీంకోర్టు తీర్పును ఎస్బీఐ అమలు చేయాలి

● సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కావలిటౌన్, మార్చి 11: ఎలక్ట్రోరల్ బాండ్ల విషయం లో సుప్రీం కోర్టు తీర్పును ఎస్బీఐ అమలు చేయాలని సీపీఎం జిల్లా నేత పసుపులేటి పెంచలయ్య పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమ వారం ఎస్బీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్లు ఇవ్వడం చట్టవిరు ద్ధమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో బాండ్ల వివరాలు మార్చి 6వ తేదీ లోపు వెల్లడించాలని ఆదేశించినప్పటికీ ఎస్బీఐ మరింత సమయమడ గడం విడ్డూరమన్నారు. కేంద్రంలోని బీజేపీని బలపరిచేందుకు ఎస్బీఐ గడువు కోరుతుందన్నారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బాండ్ల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జునరావు, ఎస్‌కె మస్తాన్, కృష్ణమోహన్, మహబూబ్ బాషా తదిత రులు పాల్గొన్నారు.



ఎస్బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

అయోడిన్ లోపంపై విద్యార్థులకు వైద్య పరీక్షలు

జలదంకి, మార్చి 11: మండలంలోని జమ్మలపాలెం ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై జలదంకి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు చేశారు. 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ ఎ.శ్రీనివాసులు పరీక్షలు పరీక్షలు నిర్వహించి అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్‌లలో 1 నుంచి 6వ తరగతి విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యసి బ్బంది సోమవారం అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి అయోడిన్ లోపంతో జరిగే అనర్థాలపై వివరించారు. అదే విధంగా పలువురు విద్యార్థుల నుంచి యూరిన్ శాంపిల్స్, వాళ్ళ ఇళ్ళల్లో వాడే సాల్ట్ శాంపిల్స్‌ను సేకరించి జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యా లయనికి పంపించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సక్కుబాయమ్మ, వైద్యసిబ్బంది ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

అల్లూరు, మార్చి 11 : అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు ప్రతి నెల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ చేస్తారు. అందులో భాగంగా సోమవారం జరిగిన కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివ ప్రియతో కలసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, మొగళ్లపల్లి సురేష్, మోమిడి మాధవరావు, ఒట్టూరు శ్రీనివాసులు, పొత్తూరు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, మొగళ్లపల్లి అనిత పాల్గొన్నారు.

యువత తలచుకుంటే దేశం తలరాతే మారుతుంది

కావలిటౌన్, మార్చి 11: యువత తలచుకుంటే దేశ తలరాతే మారు తుందని కావలి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పీఎస్సార్ ట్రస్ట్ కార్యాలయంలో రూరల్ మండలం నడింపల్లి గ్రామానికి చెందిన 150మంది యువత పసుపులేటికి మద్దతు తెలపగా వారికి సుగు ణమ్మ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం గాయత్రినగర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పసుపులేటి సోదరుడు వెంకటే శ్వర్లు, శ్రీనివాసులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కనుమలలో అరుదైన వృక్షాలపై పరిశోధనకు టీఆర్ఆర్ అధ్యాపకుడు

కందుకూరు, మార్చి 11: తూర్పు కనుమలలోని నల్లమల, శేషాచలం అడవుల్లో ఉన్న అరుదైన వృక్షసంపద, ఆ వృక్షసంపద వలన మానవాళికి ఉపయోగాలపై పరిశోధన చేసేందుకు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టరు తిరుపతిస్వామికి ప్రభుత్వం, అటవీశా ఖల నుంచి అనుమతి లభించింది. టీఆర్ఆర్ వృక్షశాస్త్ర విభాగంలో పనిచే స్తున్న ఆయన కడప, వెంకటగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న వృక్షశాస్త్ర అధ్యాపకులతో కలిసి బృందసారథిగా ఈ పరిశోధనను ఏడాది పాటు నిర్వహించేందుకు అనుమతి లభించింది. ముఖ్యంగా తూర్పు కను మలలో ఉన్న అరుదైన వృక్షసంపద యొక్క ఔషధ గుణాలను అధ్య యనం చేసి తద్వారా మానవాళికి చేకూరే ప్రయోజనాలపై నివేదిన సిద్ధం చేయడం ఈ పరిశోధన ఉద్దేశని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. ఇటీవలే ఆంధ్రకేసరి యూనివ ర్సిటీ వారు కళాశాల ఇతర మూడు విభాగాలతో పాటు వృక్షశాస్త్ర విభాగా నికి కూడా పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసి తిరుపతిస్వామికి రీసెర్చ్ గైడ్‌షిప్‌ను మంజూరు చేశారని ఆయన తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కందుకూరు, మార్చి 11: వెలుగు సిబ్బంది, మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సిబ్బంది సోమవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కందుకూరు మండ లంలో 1,799 మందికి, మున్సిపాలిటీ పరిధిలో 2,362 మంది మహిళలకు పొదుపు రుణమాఫీ నాలుగో విడత కింద ఆసరా చెక్కులను వారివారి ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు.

రామాయపట్నం పోర్టులో రక్తదానం

గుడ్లూరు, మార్చి 11 : మండలంలోని మొండివారిపాలెంలో నిర్మిస్తున్న రామాయపట్నంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రామా యపట్నం పోర్టు సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా కావలి రెడ్‌క్రాస్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రామాయపట్నం పోర్టు ప్రాజెక్టు హెడ్ కంద పెరుమాళ్, జనరల్ మేనేజర్ శేష ప్రారంభించారు. అనంతరం రామాయపట్నం పోర్టులో పనిచేస్తున్న 57 మంది సిబ్బంది రక్తదానం చేశారు. పోర్టు సేఫ్టీ మేనేజర్ పోలారావు పాల్గొన్నారు.

భీమవరం హైస్కూల్ వార్షికోత్సవం

ఉలవపాడు, మార్చి 11 : మండలంలోని భీమవరం హైస్కూల్లో సోమవారం ప్రధానోపాధ్యాయుడు బండి సుబ్బారావు అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యా ర్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, ప్రసాద్, హనోక్, మస్తా న్ వలి, హేమలత, చిట్టిబాబు, సుబ్బారావు, లలిత పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం

వలేటివారిపాలెం, మార్చి 11: కుటుంబ కలహాల నేపథ్యంలో యువకు డు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండ లంలోని కాకర్లవారిపాలెంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు.. కాకర్లవారిపాలెంకు చెందిన పెయ్యిల మాధవ అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం మాధవరావును 108 వాహనంలో వలేటివా రిపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మార్చి 11 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో యు శేషుబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

14న వలేటివారిపాలెం...

వలేటివారిపాలెం, మార్చి 11 : స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో గురువారం ఎంపీపీ పొనుగోటి మౌనికి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కర్లపాలెం, సాలిపేట నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

కందుకూరు, మార్చి 11: రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాలైన కర్ల పాలెంలో 14 మందికి, సాలి పేట ఎస్టీ కాల నీలో 84 మందికి వెంటనే ప్యాకేజీ నగదు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బాధితులు సోమ వారం కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజే శారు. నిర్వాసిత కుటుంబాల సర్వే సమయంలో సాలిపేట ఎస్టీ కాలనీ నుంచి తాత్కాలిక వలసలు వెళ్లి ఉన్న 18 మందిని కూడా జాబితాలో చేర్చా లని, కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం, సాలిపేట గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు విద్యాధరి మాట్లాడుతూ రెండురోజుల్లో ప్యాకేజీ డబ్బులు వారి ఖాతాలకు జమచేస్తామని, వచ్చిన నగ దును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ల పాలెం సర్పంచు చాపల రమణయ్య, చాపల శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, చేవూరి స్వామి, బాపట్ల కాలేషా, మస్తాన్‌రావు, చాపల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరు విద్యాధరితో మాట్లాడుతున్న నిర్వాసితులు

టీడీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

● ట్రంకురోడ్డు వెంబడి వ్యాపార వర్గాలను కలసిన కావ్య

కావలి, మార్చి 11: కావలి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆయా పార్టీల క్యాడర్‌తో కలిసి సోమవారం కావ లి ట్రంకు రోడ్డు వెంబడి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వ్యాపారవర్గాలను కలసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీ వద్ద నుంచి రోడ్డుకు పశ్చిమ మార్గంలో ఉన్న వ్యాపారవర్గాలు, రోడ్డు మార్జిన్ వ్యాపారులతో ఆయ న మమేకమై సైకిల్ గుర్తుపై టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని, చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని అభ్యర్థించారు. వ్యాపార వర్గాల సాధ కబాధకాలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలకు సంబంధించిన మేనిఫెస్టోను, కావలిలో తనను గెలిపిస్తే నియోజ కవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన సొంత మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను వ్యాపారవర్గాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కావ్య, టీడీపీ నేతలు

పరస్పర సహకారంతో విజయం సాధిద్దాం !

● జనసేన ప్రచార ర్యాలీని ప్రారంభించిన ఇంటూరి

కందుకూరు, మార్చి 11: తెలుగుదేశం, జనసేన పార్టీ అధినేతల ఆదేశాలతో రాబో యే సార్వత్రిక ఎన్నికల్లో పరస్ప రం సహకరించు కుంటూ ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంకు చెందిన ఎన్ఆర్ఐ కొట్టే ఉదయ భాస్కర్ కొట్టే వారి లక్ష్యం కొణిదల వారి విజయం పేరుతో ఏర్పాటు చేసిన జనసేన ప్రచార రథాల విజయ యాత్ర సోమవారం కందుకూరుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఇరుపార్టీల నేతలు ఇంటూ రి నాగేశ్వరరావుతో కలిసి టీడీపీ, జనసేన జెండాలను ఊపి విజయయాత్ర ను ప్రారంభించి యాత్రలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో బీజేపీ కార్యాలయా నికి వెళ్లిన ఇంటూరి నాగేశ్వరరావు ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్ట మనేని హరిబాబుతో సమావేశమై బీజేపీ నాయకులను పరిచయం చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, గోచిపా తల మోషే, చిలకపాటి మధు, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, వడ్డెళ్ల రవి చంద్ర, సవిడిబోయిన వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాలకు జెండా ఊపుతున్న నాగేశ్వరరావు

శబ్ద కాలుష్యం నుంచి కాపాడండి

కావలి, మార్చి 11: సార్వత్రిక ఎన్నికల ప్రచా రం వేళ కావలి నియోజకవర్గ ప్రజలను శబ్ద కాలుష్యం నుంచి కాపాడాలని దళి త సంఘర్షణ స మితి జిల్లా అధ్య క్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఈ మేరకు సోమవారం కావలి ఆర్డీవో శీనానాయ క్‌కు వినతిపత్రం అందచేశారు. కావలి పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రా మాలలో కూడా ఎన్నికలు రాకముందే వేకువ జాము నుంచి డీజే మైకులు పెట్టి పెద్ద పెద్ద శబ్దాలతో గుండె దడ పుట్టిస్తున్నారన్నారు. గుండె జబ్బులు ఉన్న వారు ఈ శబ్దాలకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీస్‌లు కూడా విచ్చలవిడిగా మైక్ పర్మిషన్‌లు ఇస్తున్నారన్నారు. పర్మిషన్లు అతిక్రమించి మైక్‌లు పెట్టి పెద్దపెద్ద శబ్దాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయ రత్నం, ముక్కు మోహన్‌రావు, జడ్డా వాసు, షేక్ ఖాదర్‌బాష, షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

వచ్చే ఎన్నికల్లో ఆఖరిసారి పోటీ చేస్తున్నా.. సహకరించండి : కాటంరెడ్డి

అల్లూరు, మార్చి 11 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆఖరిసారి పోటీ చేస్తున్నానని తనకు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలో ఆయన గిరిజనులతో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గిరిజనులకు అనేక విధాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వయసు పెరుగుతున్న నేపథ్యంలో ఇదే ఆఖరి ఎన్నిక లుగా నిర్ణయించుకొని చివరిసారిగా ఓటు అడిగేందుకు తాను ముందుకు వచ్చానన్నారు. స్వగ్రామ వాసినని, అందరికీ సుపరిచితుడునైన తనను ఆద రించి ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ, గుర్తు ఇప్పటి వరకు లేవని, అవి కేటాయించేలోపు ముందుగా కలిసేందుకు ఈ సమావేశం నిర్వహించాన న్నారు. ప్రతి ఒక్కరూ చివరిసారిగా ఈ ఎన్నికల్లో పోటీలో ఉంటున్న తనకు ఓటు వేసి గెలిపించాలని, తద్వారా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, గోసా గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, ప్రభాకర్, మాతయ్య, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 11: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 వతరగతి, ఇంటర్ ప్రథమ సంవ త్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయంతి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల కొరకు ఏప్రిల్ 11 వరకు సంబం ధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.